నవతెలంగాణ
1
ఆదిలాబాద్
గురువారం | మార్చి 21, 2024 | www.navatelangana.com

మర్సకోల సరస్వతికి ఉత్తమ మహిళా అవార్డు

నవతెలంగాణ-ఉట్నూర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో బుధవారం మక్ష గ్లోబల్ పౌండషన్ వారి ఆధ్వర్యంలో మర్సకోల సరస్వతి జాతీయ ఉత్తమ మహిళా సేవా పురస్కార్-2024 అందుకున్నారు. లక్కారం గ్రామానికి చెందిన సరస్వతికి రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, మిస్ ఆసియా రష్మీ ఠాకూర్ అవార్డు అందజేశారు. తన రచనలు, గానంతో రాణిస్తూ ఉత్తమ మహిళా అవార్డు అందుకున్న ఆమెను ప్రజలు, కవులు అభినందిస్తున్నారు.



పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

కెరమెరి : యువకులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని ఎంపీపీ పెందూర్ మోతీరాం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనందరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతోనే శారీరక ధృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం ఏర్పడుతుందని తెలిపారు. క్రీడల వల్ల క్రీడాకారుల మధ్య స్నేహాభావం పెంపొందుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువకులు క్రీడలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. నాయకులు కోవ దేవరావు, సిడాం ధర్ము పెందోర్ శ్రీనివాస్, నిర్వహణ కమిటీ సభ్యులు దండుగుల శ్రీనివాస్, ఎల్లప్ప పాల్గొన్నారు.



హస్తం అభ్యర్థిగా ఆత్రం సుగుణ..?

- సీఈసీ సమావేశంలో ఈమె వైపే మొగ్గు
- తాజాగా టికెట్ కేటాయించినట్లు అధిష్టానం నుంచి సమాచారం
- టీచర్ ఉద్యోగానికి రాజీనామా..కాంగ్రెస్‌లో చేరిక
- నేడు అధికారికంగా ప్రకటించే అవకాశం

లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచే కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనే ఉత్కంఠకు ఇక తెరపడనుంది.. ఆ పార్టీ తరపున ఆత్రం సుగుణను బరిలో దింపేందుకు ఆ పార్టీ అధిష్టానం నిర్ణయించినట్లు తెలిసింది. కాంగ్రెస్ సీఈసీ సమావేశంలోనూ మెజార్టీ నాయకులు ఈమె వైపే మొగ్గుచూపినట్లు తెలిసింది. చివరి వరకు డా.ఆత్రం సుగుణతో పాటు ప్రముఖ వైద్యురాలు సుమలత పేరును సైతం పరిగణనలోకి తీసుకున్న ఆ పార్టీ అధిష్టానం..చివరకు సుగుణ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు బుధవారం ఆమెకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఇదే రోజున రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. దీంతో ఇన్నాండ్లు కాంగ్రెస్ నుంచి ఎవరు బరిలో ఉంటారనే చర్చకు తెరపడనుంది. టికెట్ కేటాయింపు విషయాన్ని గురువారం ఆ పార్టీ అధిష్టానం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

లోక్‌సభ సమరాన్ని ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఈ సీటును కైవసం చేసుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నాయి. ఇందులో భాగంగా అభ్యర్థుల ఎంపికలోనూ ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అభ్యర్థిత్వాన్ని ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న సక్కును టికెట్ ఇవ్వకుండా జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఉన్న కోవలక్ష్మీకి టికెట్ కేటాయించింది. ఆ సమయంలోనే సక్కును ఎంపీ టికెట్ కేటాయిస్తామని గులాబీ పార్టీ అధిష్టానం హామీనిచ్చినట్లు ప్రచారం జరిగింది. తాజాగా లోక్‌సభ ఎన్నికల్లో ఆయన్నే బరిలో దింపుతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. మరోవక్క బీజేపీ నుంచి మాజీ ఎంపీ గోడం నగేష్ పేరును ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావును కాదని.. గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన నగేష్‌ను ఇటీవల బీజేపీలోకి చేర్చుకొని పార్టీ టికెట్ కేటాయించింది. ఈ రెండు పార్టీల అభ్యర్థులు తేలినా..రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి ఎవరోననే ఉత్కంఠ నెలకొంది. ఢిల్లీలో మంగళవారం సాయంత్రం సమావేశమైన కాంగ్రెస్ ఎన్నికల కమిటీ(సీఈసీ) అభ్యర్థి ఎంపికపై చర్చించింది. ఈ సమావేశంలో మెజార్టీ నేతలు సుగుణ అభ్యర్థిత్వం వైపే మొగ్గుచూపినట్లు తెలిసింది. తాజాగా టికెట్ కేటాయింపు విషయమై అధిష్టానం నుంచి ఆమెకు ఫోన్ ద్వారా సమాచారం అందించినట్లు తెలిసింది.

ఉద్యోగానికి రాజీనామా..కాంగ్రెస్‌లో చేరిక

ఇన్నాండ్లు ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఆత్రం సుగుణ తాజాగా ఉద్యోగానికి రాజీనామా చేశారు. కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేయాలనే ఉద్దేశంతో కొన్ని నెలలుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఆ పార్టీ టికెట్ ఆశిస్తూ దరఖాస్తు చేశారు. తాజాగా ఆ పార్టీ అధిష్టానం పరిశీలనలో నలుగురు అభ్యర్థుల పేర్లు పరిగణనలోకి వచ్చినా..చివరి సమయంలో సీఈసీలో భేటీలో ఆమెవైపు మెజార్టీ నాయకులు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. తాజాగా అధిష్టానం నుంచి టికెట్ కేటాయింపునకు సంబంధించి సమాచారం రావడంతోనే ఆమె టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేస్తూ నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. ఇదే రోజు రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. కాగా టికెట్ కేటాయింపు విషయమై కాంగ్రెస్ అధిష్టానం గురువారం అధికారికంగా ప్రకటించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

దండేపల్లిలో వడగండ్ల వాన

- రోడ్లపై పడిపోయిన భారీ వృక్షాలు, స్తంభించిన వాహనాలు
- వందల ఎకరాల్లో పంటనష్టం



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలో బుధవారం సాయంత్రం కురిసిన అకాల వర్షం నష్టం మిగిల్చింది. పిడుగుపాటుకు గురై ఇద్దరు రైతులకు చెందిన ఏడు మేకలు చనిపోగా వందల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. మేదరిపేట, చింతపల్లి, తాళ్లపేట క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో మొక్కజొన్న పంట పూర్తిగా నేలకొరిగింది. భారీ గాలులకు మామిడి పంట నేల రాలింది. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షానికి దెబ్బతినడంతో రైతులు కన్నీరు మున్నీరయ్యారు. మండల వ్యాప్తంగా సుమారు 190 మంది రైతులకు చెందిన 300 ఎకరాల వరకు పంట నష్టం జరిగినట్లు మండల వ్యవసాయ అధికారి అంజిత్ కుమార్ అంచనా వేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పంట నష్టపోయిన రైతుల వివరాలు నమోదు చేసి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఈదురుగాలులతో కూడిన వర్షానికి రోడ్లపై భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో ప్రధాన రహదారిపై గంటలపాటు వాహనాలు నిలిచిపోయాయి. అధికారులు స్పందించి రోడ్డుపై పడ్డ చెట్లను తొలగించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీ



నవతెలంగాణ - రెబ్బెన

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మండలంలోని గోలేటి, రేపల్లెవాడ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ సురేష్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేస్తామని, నగదు, మద్యం, ఉచిత పంపిణీలపై ప్రత్యేక నిఘా ఉంటుందనియ తెలిపారు. మోడల్ కోడ్ అమల్లోకి వచ్చినందున ప్రజలు రూ.50 వేల కంటే ఎక్కువ మొత్తంలో తీసుకెళ్తే ఆధారాలు చూపాలని తెలిపారు. లేనిపక్షంలో నగదు, ఇతర వస్తువులు, బంగారు ఆభరణాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటి వరకు జిల్లాలో 173 లీటర్ల మద్యాన్ని స్వాదీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.87,887 వేలు ఉంటుందన్నారు. నగదు రూపంలో రూ.23.89 లక్షలు, 17 ఎల్‌జీ మిక్సర్ గ్రైండర్లు, 47 కూలర్లు వాటి విలువ రూ.1.75లక్షలు సీజ్ చేశామన్నారు. అపరిచిత వ్యక్తుల సమాచారం తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో కానీ, జిల్లా ఎన్నికల కంట్రోల్ నెంబర్ 08733279033కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రతి ప్రింటింగ్ ప్రెస్ నియమ నిబంధనలు పాటించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల ప్రచారానికి సంబంధించి ప్రతి ప్రింటింగ్ ప్రెస్ యజమాని ఎన్నికల నియమ నిబంధనలను పాటించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. బుధవారం కలెక్టర్ ప్రింటింగ్ ప్రెస్, ఫ్లెక్సీ యజమానులతో తన ఛాంబర్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి సంబంధించి ప్రతి ప్రింటింగ్ ప్రెస్ యజమాని ఎన్నికల నియమ నిబంధనలను పాటించాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా ప్రచార సామాగ్రి ప్రింటింగ్ చేసేటప్పుడు పాటించవలసిన నియమాలపై అవగాహన కల్పించారు. ప్రచారం కొరకు ఇచ్చే కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలపై ప్రచారం ఇచ్చే వారి వివరాలు నిర్ణీత ప్రొఫార్మాలో ప్రింటింగ్ ప్రెస్ యజమానులకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రింటింగ్ ప్రెస్ వారు సైతం ప్రచారం ఇచ్చే వారి పూర్తి వివరాలు దరఖాస్తు ఫారంలో తీసుకొని తన వద్ద భద్రంగా రికార్డు చేసుకోవాలని సూచించారు. ప్రింటింగ్ ప్రెస్ సంబంధిత ప్రచారానికి సంబంధించి ఎన్ని కాపీలు ప్రింట్ చేశారు, అందుకు ఎన్ని రూపాయలు ఖర్చయ్యాయి అనే వివరాలు ఎప్పటికప్పుడు జిల్లా వ్యయ కమిటీకి అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి కరపత్రం పోస్టర్‌పై సంబంధిత ప్రింటింగ్ ప్రెస్ పేరు, తేది, బిల్లు క్రమ సంఖ్య ఎన్ని కాపీలు ముద్రించారు అనే పూర్తి వివరాలు ఉండాలని ఆదేశించారు. ఎవరైన నియమాలను అతిక్రమిస్తే ఎన్నికల నియమ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాల్గొన్నాను.

రూ.50వేలు దాటిన లావాదేవీలకు రశీదు ఉండాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రూ.50వేల నుంచి రూ.10లక్షల మధ్య డబ్బుల లావాదేవీలు జరిగితే కచ్చితంగా రశీదు ఉండాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి ఇంటెలిజెంట్, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, బ్యాంకర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూ.10లక్షలపైన లావాదేవీలు ఉంటే ఆదాయ పన్ను శాఖ పరిధిలోకి వెళ్తుందని చెప్పారు. జిల్లాలో ఏటీఎంలలో డబ్బులు నింపేందుకు వచ్చే సెక్యూరిటీ వ్యాన్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. ఏజెన్సీలు పెద్ద మొత్తంలో డబ్బులు తరలించాలంటే తెలంగాణ సీఈఓ నుంచి అనుమతి తప్పనిసరిగా పొందాలన్నారు. లాకర్స్‌లో గోల్డ్‌ను పర్యవేక్షించి, క్యాష్ జెనరేట్ చేయడానికి క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించాలని, వెహికిల్ నంబర్‌లను తనిఖీ చేయాలని వివరించారు. అలాగే ప్రతి రోజూ క్యాష్ డిపాజిట్ వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం సీజ్ చేసిన వాటిని ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టలలో (ఈఎస్ఎంఎస్)నమోదు చేయాలని, ఎన్నికల పారదర్శకత నిర్వహణలో భాగంగా ఎన్నికల నిబంధనల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు, స్టాటిస్టికల్ సర్వైలెన్స్ టీముల నిఘా, పర్యవేక్షణలో పట్టుకున్న డబ్బు, మద్యం, బంగారం, డ్రగ్స్ విలువైన వస్తువుల వివరాలను పోర్టల్‌లో సకాలంలో నమోదు చేయాలని సూచించారు. ఏఆర్‌ఓలు, పోలీస్ అధికారులు తమ పరిధిలోని ప్రతి ఒక్క పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, మౌళిక సదుపాయాల పరంగా, భద్రతా పరంగా చేపట్టాల్సిన చర్యల గురించి కార్యాచరణ రూపొందించాలన్నారు. సువిధ సింగిల్ విండో ద్వారా అనుమతులు జారీ చేయాలని, నిర్ణీత కాలవ్యవధిలోగా అనుమతులు జారీ అయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి, రిషిప్షన్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు చూసుకోవాలన్నారు. యువతతో సమావేశాలు నిర్వహించి, సి-విజిల్‌పై అవగాహన కల్పించాలన్నారు. నగదు, మద్యం రవాణాను నియంత్రించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్యామలాదేవి, ఏఎస్పీఎస్పీ జీవన్‌రెడ్డి, ఎక్సైజ్, ఎల్డీఎం, బ్యాంకర్లు పాల్గొన్నారు.

ప్రమాద రహిత ప్లాంట్‌గా రాణించాలి



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో ప్రతి ఒక్కరు ఎప్పటికప్పుడు రక్షణ నియమాలు పాటిస్తూ ప్రమాదరహిత ప్లాంట్‌గా రాణించాలని సింగరేణి డైరెక్టర్(ఈఅండ్ఎం) సత్యనారాయణరావు అన్నారు. 53వ జాతీయ రక్షణ వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ఎస్టీపీపీ ఓపెన్ ఆడిటోరియంలో ప్లాంట్ ఈడీ బసివిరెడ్డి అధ్యతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ప్రభుత్వం 1972 సంవత్సరంలో నేషనల్ సేఫ్టీ కౌన్సిల్‌ని ఏర్పాటు చేసిందని తెలిపారు. మానవుని ప్రాణం ఎంతో విలువైనదని, దాన్ని దృష్టిలో పెట్టుకుని రక్షణ నియమాలు, సూత్రాలు రూపొందించారని తెలిపారు. ప్రతి ఒక్కరు రక్షణ అలవాటుగా చేసుకోవడం అవసరమని, రక్షణను జీవితం నుండి వేరుగా చూడలేమని తెలిపారు. ప్రతి ఒక్కరు భద్రతగా పని చేస్తూ ప్రతి పనిలో ఫీడ్ బ్యాక్ తీసుకుంటే భద్రంగా ఉండవచ్చని అన్నారు. ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బసివిరెడ్డి మాట్లాడుతూ రక్షణ విషయంలో ఏదైన లోపాన్ని గుర్తిస్తే వెంటనే పైఅధికారులకు తెలియజేయాలని తెలిపారు. తద్వారా జరగబోవు ప్రమాదాన్ని నివారించినట్లు అవుతుందని తెలిపారు. అదేవిధంగా ఎస్టీపీపీ క్యాపిటల్ ఓవర్ హాలింగ్(సీఓహెచ్)ను రికార్డు స్థాయిలో 35 రోజుల్లో చిన్న ప్రమాదం లేకుండా పూర్తి చేసుకున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం సేఫ్టీ ఆడిట్ నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరు రక్షణ నియమాలు పాటించాలని కోరారు. ఈ సందర్భంగా రక్షణకు సంబంధించి పవర్‌మేక్ ఉద్యోగులు లఘు నాటిక ప్రదర్శించారు. వ్యాసరచన, సేఫ్టీ పోస్టర్ డ్రాయింగ్, సేఫ్టీ స్లోగన్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సమావేశంలో సోలార్ జీఎం జానకీరామ్, ఎస్ఓటు డైరెక్టర్ కేవీ రావు, ఏజీఎం (సివిల్) కేఎస్ఎన్ ప్రసాద్, ఏజీఎం(పీసీఎస్) శ్రీనివాసులు, ఎస్టీపీపీ సీఎంఓఏఐ అధ్యక్షులు సుముద్రాల శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ రామశాస్త్రీ, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ సత్యానారాయణరెడ్డి, పవర్‌మేక్ డీజీఎం రమేష్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న మేనేజర్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ - కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట గని మేనేజర్ అల్లావుద్దీన్‌ను బదిలీపై వెళ్తున్న సందర్భంగా గనిలో ఘనంగా సత్కరించారు. 1998లో గనికి వచ్చి 23 ఏళ్ల పాటు పలు విభాగాల్లో పని చేస్తూ ఇక్కడే మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల కేకే5 గనికి బదిలీ కావడంతో గని కార్మికులు, నాయకులు, అధికారులు ఘనంగా శాలువాలు, పూలమాలతో సన్మానించి జ్ఞాపకలు అందించారు. ఈ సందర్భంగా అల్లావుద్దీన్ సేవలను, ఆయనతో ఉన్న అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు మేడిపల్లి సంపత్, వొడ్నాల రాజన్న, బానోత్ తిరుపతి, ఏఐటీయూసీ నాయకులు చిప్ప నర్సయ్య, దాగం మల్లేశ్, ఐఎన్టీయూసీ నాయకులు రాపర్తి శ్రీనివాస్, బత్తుల వేణు, దెబ్బటి తిరుపతి, అరుముళ్ల కష్ణ దరావత్ తిరుపతి, బన్న లక్ష్మణ్ దాస్, సొల్లంగి శ్రీనివాస్, మేడ సమ్మయ్య, పుష్పాల శ్రీనివాస్, బైరి శంకర్, పీవోఏ జనార్ధన్ రెడ్డి, ఎస్వీ సునీల్ కుమార్, ఇంజనీర్లు బాబు, మధూకర్, వెల్ఫేర్ ఆఫీసర్ మీర్జా గౌస్ జీషాన్, అంగన్ మేనేజర్లు నిఖిల్, వెంకటేశ్, వంశీకృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజలకు ఎల్లవేళలా అండగా నిలవాలి

- నిర్మల్ ఎస్పీ డా.జి.జానకి షర్మిల



నవతెలంగాణ-నిర్మల్

సమస్యలపై ప్రజలకు పోలీసులు ఎల్లవేళలా అండగా నిలవాలని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ఎస్పీ డా.జి.జానకి షర్మిల అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలోని కొన్ని పోలీస్టేషన్లలో పెండింగులో ఉన్న కేసుల వివరాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగులో ఉన్న కేసులను సత్వరమే పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహిళలకు వ్యతిరేకంగా జరిగే నేరాలలో పకడ్బందీగా విచారణ చేసి నిందితులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. కేసులు విచారణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, ప్రతి కేసులో సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేకూరేలా పని చేయాలని సూచించారు. ప్రస్తుత కాలంలో సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా కొత్త కొత్త మోసాలకు పాల్పడుతూ అమాయకపు ప్రజల నగదును సునాయాసంగా దోచుకుంటున్నారని అన్నారు. జిల్లా ప్రజలందరికీ సైబర్ నేరాల బారిన పడకుండా నిత్యం అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు క్షేత్రస్థాయిలో చేపట్టవలసిన భద్రత ఏర్పాట్లను, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి పలు సూచనలు చేశారు. జిల్లా పరిధిలో అవసరమైన అన్ని చోట్ల చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అక్రమంగా తరలిస్తున్న డబ్బును పట్టుకోవడానికి అవసరమైన చోట్ల మరిన్ని చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. అత్యవసరం ఉన్న పోలింగ్‌స్టేషన్ ప్రాంతాలలో సిసి కెమెరాల ఏర్పాటు, పోలింగ్‌స్టేషన్‌లో మౌలిక సదుపాయాల ఏర్పాటు ముందుగానే చూసుకోవాలని, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఎన్నికల సమయంలో లా అండ్ ఆర్డర్ సమస్య, గొడవలు సృష్టంచే అవకాశం ఉన్న సోషల్ మీడియా సందేశాలు, వీడియోలు వైరల్ చేసే విషయాలపై ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. సిబ్బంది ఎల్లప్పుడూ అలర్ట్‌గా ఉండేలా చూడాలని, సమస్యాత్మక గ్రామాలను విధిగా పర్యటిస్తూ ఆ గ్రామాలపై దృష్టి సారించాలని తెలిపారు. సమావేశంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, నిర్మల్ డిఎస్పీ గంగారెడ్డి, డిసిఆర్బి డిఎస్పీ రవీందర్‌రెడ్డి, నిర్మల్ పట్టణ, గ్రామీణ సిఐలు అనిల్, శ్రీనివాస్, భైంసా పట్టణ, గ్రామీణ సిఐలు రాజారెడ్డి, శ్రీనివాస్, ఖానాపూర్ సిఐ మోహన్, సోన్ సిఐ నవీన్‌కుమార్, ముధోల్ సిఐ మల్లేష్, డిసిఆర్బి సిఐ నైలు పాల్గొన్నారు.

జిజ్ఞాస రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ఆదిలాబాద్‌కు చెందిన విద్యార్థులు రూపొందించిన ఐదు జిజ్ఞాస ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. తెలుగు విభాగం నుంచి ఉపన్యాసకులు ఏ.కపిల్ మార్గదర్శకత్వంలో విద్యార్థులు రూపొందించిన 'ఆదిలాబాద్ జిల్లా కొలాములు - జీవన స్థితిగతులు, హిందీ విభాగంలో సహాయ ఆచార్యులు టి ప్రతాప్‌సింగ్ మార్గదర్శకత్వంలో 'ఆదివాసీ హిందీ కహానియోంమే స్త్రీ ఔర్ ఉస్ కీ సమస్యాయే', ఇంగ్లీషు విభాగంలో డి దయాకర్ మార్గదర్శకత్వంలో 'పర్సెప్షన్ ఆఫ్ స్పిరిచ్యువల్ ఎలిమెంట్స్ ఇన్ ఆర్ కే నారాయణ్స్ ఫిక్షన్ - ది గైడ్, ఫిజిక్స్ విభాగంలో జాడి తిరుపతి మార్గదర్శకత్వంలో రూపొందిన 'డిజైన్ అండ్ కన్స్ట్రక్షన్ ఆఫ్ పర్సనల్ రిచార్జేబుల్ ఫ్యాన్ కం ఆటోమేటిక్ లైట్', కెమిస్ట్రీ విభాగంలో సాయి ప్రసాద్ బృందం రూపొందించిన డిజైన్ ఆఫ్ యాంటీ వైరల్ ఏజెంట్స్ త్రో మాలిక్యులర్ డాకింగ్ అండ్ ఇన్ సిల్కో డ్రగ్ లైక్ నెస్ ఎవాల్యుయేషన్' అనే ఐదు ప్రాజెక్టులు జిజ్ఞాస రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. 2016 నుంచి కళాశాల విద్యాశాఖ డిగ్రీ విద్యార్థుల్లో పరిశోధనాశక్తిని, పరిశోధనాసక్తిని పెంపొందించడానికి ఈ పోటీలను నిర్వహిస్తోంది. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.30వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.21వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.12వేలు నగదు బహుమతులను అందిస్తుంది. ఈ సంవత్సరం నిర్వహించిన జిజ్ఞాస జిల్లా స్థాయి పోటీల్లో మొత్తం 1033 ప్రాజెక్టులు రాగా అందులో నుంచి 16 సబ్జెక్టుల్లో 290 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఇందులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ఆదిలాబాద్ విద్యార్థులు ఐదు సబ్జెక్టుల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, జిజ్ఞాస సమన్వయకర్త కె.రమేశ్ అధ్యాపకులు రడాపు సంతోష్ కుమార్ ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులను, మార్గదర్శనం చేసిన అధ్యాపకులను అభినందించారు. 2018లో సాధించినట్లు ఈ సారి కూడా ఐదు రాష్ట్రస్థాయి బహుమతులు సాధించి కళాశాలకు పేరు తేవాలని ఆకాంక్షించారు.

పారిశుధ్య కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు

నవతెలంగాణ-మందమర్రి

మండలంలోని ఆదిల్‌పేట గ్రామంలో బుధవారం వ్యవసాయ కళాశాల విద్యార్థులు పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కళాశాల విద్యార్థులు పరిశుభ్రత ప్రాముఖ్యత గురించి గ్రామస్తులకు వివరించారు. మన చుట్టూ ఉండే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ సర్పంచ్ సోదరి పున్నం, కారోబార్ మల్లేష్, పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

తోటి ఆటో డ్రైవర్‌కు చేయూత

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ మారుతికి బుధవారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రూ.5వేలతో పాటు నెలకు సరిపడే సరకులను అందించి, ఉదారతను చాటుకున్నారు. బోథ్ పట్టణానికి



చెందిన మారుతి వికలాంగుడు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఆరోగ్యం సహకరించకపోవడంతో ఇంట్లోనే ఉన్నాడు. ఇలా కుటుంబ పోషణ కష్టం కావడంతో తోటి ఆటో డ్రైవర్‌లు తనకు మేము ఉన్నమంటూ భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సంఘ నాయకులు, డ్రైవర్‌లు, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనానికి మరమ్మతులు

నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆ పాఠశాలలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త సుజాత కూతురు మౌనిక రెడ్డి, కుమారుడు డా.సాయి ప్రణీత్ రెడ్డి తమ సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించారు. పాఠశాలలో రూ.60 వేలతో ఫ్లోరింగ్, ప్రహరీ గోడ, వాల్ పెయింట్, గోడలపై బొమ్మలు వేయించారు. బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా వచ్చిన సీడీపీఓ సరిత దాతలను అభినందించారు. అనంతరం మరమ్మతులు చేసిన కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నిర్మల, రాధ, శ్యామల, షహనాజ్, అంగన్‌వాడీలు మమత, సరోజ, గర్భిణులు, బాలింతలు, తల్లులున్నారు.



సంపూర్ణ ఆరోగ్యానికే పోషణ్ పక్షోత్సవాలు



తాంసి మండలం పొన్నారిలో

నవతెలంగాణ-తాంసి

పోషణ లోపంతో బాధపడుతున్న వారిని గుర్తించి, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పోషణ్ పక్షోత్సవాలను నిర్వహిస్తోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ అన్నారు. బుధవారం మండలంలోని పొన్నారి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్షోత్సవాలను మిషన్ శక్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముగ్గులు వేసి, సంపూర్ణ ఆరోగ్యానికి తీసుకోవాల్సిన పండ్లు, కూరగాయాలు, ఆకు కూరలు రంగవళ్లులపై ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చిన్నారులను, తల్లులను, గర్భిణుల సంపూర్ణ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో ఆహార నియమాలు అవలంభించే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు గడుగు దేవమ్మ, సూరం గంగమ్మ మాట్లాడుతూ పిల్లల్లో ఎత్తు, బరువు పెరుగుదల, రక్తహీనత, లేకుండా ఉండేందుకు అంగన్‌వాడీల ఆధ్వర్యంలో బలవర్ధకమైన పోషకాహారాన్ని అందించడం జరుగుతుందని అన్నారు. అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో ఆరోగ్య రక్షణకు పాటించాల్సిన సూత్రాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. అదేవిధంగా తాంసిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్షోత్సవాలని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ శ్రావ్య, పంచాయతీ కార్యదర్శి హరిత, ఎంపీటీసీ రేఖ, మహిళ సాధికారత సిబ్బంది కృష్ణవేణి, కోటేశ్వర్, నిఖిలేశ్వర్, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, ఎపీఎం రవీందర్, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, అంగన్‌వాడీ ఆయా రాధ, ఆశ వర్కర్లు వెంకటమ్మ జ్యోతి, వీఓ లిడర్స్, మాజీ సర్పంచ్ అశోక్ పాల్గొన్నారు.

నార్నూర్ : మండల కేంద్రంతో పాటు తాడిహత్నూర్, నాగల్‌కొండ అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ పక్షోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ శారద, సూపర్‌వైజర్ వందన, పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు, గర్భిణీ, బాలింతలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ శారద, సూపర్‌వైజర్ వందన మాట్లాడుతూ మూడు నుంచి ఆరు సంవత్సరాల చిన్నారులకు ప్రీస్కూల్ ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చిరుధాన్యాల వాడకంతో గర్భిణులకు రక్తహీనత నుండి కాపాడుకోవచ్చని అన్నారు. గర్భిణులు ఎక్కువ పోషక ఆహారాన్ని తీసుకోవాలన్నారు. పిల్లల ఎదుగుదలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. రకరకాల చిరుదాన్యాల్లో దొరికే పోషక విలువలను గురించి వివరించారు. అంగన్‌వాడీలు జాదవ్ పంచాపులా, రాథోడ్ సావిత్రి, రాథోడ్ శ్యామక, నిరిష, మాయావతి, లీలా బాయి, ప్రమీల, హెచ్ఈఓ నాందేవ్, వైద్యసిబ్బంది కైలాస్, మాన్కు బాయి, విమల, ప్రియాంక, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు ఉన్నారు.



నార్నూర్‌లో..



తలమడుగులో..

తలమడుగు : మండలంలోని ఝరి, పల్లి(కె), పల్లి(బి), గ్రామాల్లో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఝరి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ నర్సమ్మ హజరై మాట్లాడారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రల్లో పోషణ్ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోషక వారోత్సవాల్లో గర్భిణులు, బాలింత మహిళలు పోషక విలువలు, ఆహారం పట్ల జాగ్రత్తలు సూచనలు తెలియజేయడం జరుగుతుందని అన్నారు. పోషక విలువలతో కూడిన చిరుధాన్యాలు, కూరగాయలు ఆకుకూరలు ఆహారంలో తీసుకోవాలని మహిళలను కోరారు. జీరో వయసు నుంచి ఆరు సంవత్సరాల కిషోర పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. గర్భిణీలు బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు అనసూయ, లక్ష్మి, అడెల్ల, గంగుబాయి గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని కల్పించాలి



నవతెలంగాణ-కడెం

ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని అంబారిపేట్ గ్రామంలో ఉపాధి పనులను సందర్శించి కూలీలతో మాట్లాడుతూ ఒక రోజుకు ఉపాధి కూలీ రూ.600 చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కూలీ వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, క్రమక్రమంగా ఉపాధి హామీ పనులను ఎత్తివేయడానికి కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు రోజుకు రూ.300 కూలీ, సంవత్సరానికి 150 రోజుల పని దినాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. అలాగే కూలీలకు పనిముట్లు గడ్డపార, తట్టా, పారా కొనుగోలు చేసి ఇవ్వాలని, నీడ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, ఉపాధి హామీ కూలీలు కొలివెని లచ్చన్న, తాళ్లపెల్లి నర్సయ్య, చిరుత లింగన్న, సురిమిల్ల పోలు, అల్లంల మల్లేష్ పాల్గొన్నారు.

జాబ్ కార్డులున్న కూలీలకు పనులు కల్పిస్తాం

నవతెలంగాణ-నార్నూర్

జాబ్ కార్డ్ కలిగి ఉన్న ప్రతి కూలీలకు ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు కల్పిస్తామని ఇన్‌చార్జి ఏపీఓ జాదవ్ శేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపెల్లి(హెచ్) గ్రామపంచాయతీలో క్షేత్ర స్థాయిలో కూలీలు నిర్వహించిన పనులను సందర్శించారు. మాస్టర్ రోల్‌ను పరిశీలించి కూలీల వివరాలు సేకరించారు. కూలీలు నిర్వహించిన పనులకు కొలతలు నిర్వహించారు. మాస్టర్‌లో పొందుపర్చిన కూలీల పేర్లు తప్ప పని చేయని వారి పేర్లు పెట్టవద్దని సిబ్బందికి సూచించారు. పనుల్లో అవినీతికి పాల్పడితే చర్యలుంటాయని హెచ్చరించారు. ఆయన వెంట టీఏ వికాస్ చౌహాన్, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

నిరుద్యోగ యువతకు స్టడీ మెటీరియల్ అందజేత

నవతెలంగాణ-ఖానాపూర్



నిరుద్యోగ యువతకు మాజీ మంత్రి వ్యక్తిగత సహాయకులు కృష్ణంరాజు గ్రంథాలయంలో స్టడీ మెటీరియల్ అందజేశారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన నిరుద్యోగ యువతీయువకులకు దాదాపు 40 వేల విలువ గల గ్రూప్స్‌తో పాటు గ్రూప్ 1, గ్రూప్ 2, డీఎస్సీ, ఎస్జీటీ స్టడీ మెటీరియల్స్‌ను 50 మంది నిరుద్యోగ యువతీయువకులకు అందించారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ నిరుద్యోగ యువత ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువు పరంగా ఏ విధమైన స్టడీ మెటీరియల్ అవసరమున్న అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లైబ్రెరియన్ పృథ్వి రాజ్, దూడం శ్రీనివాస్, తోటసత్యం, నిమ్మల రమేష్, బీసీ రమేష్, రాకేష్, శ్రీనివాస్, రాజన్న, నరేందర్, రాజేందర్, రాజేశ్వర్, రవి, ఓకేఆర్ మిత్రబృందం పాల్గొన్నారు.

ఠాను నాయక్ అడుగుజాడల్లో నడవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఠాను నాయక్ అడుగుజాడల్లో లంబాడి ప్రజలు ముందుకు నడవాలని లంబాడి జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ అన్నారు. బుధవారం మండలంలోని లింగోజితండా గ్రామపంచాయతీ సేవాదాస్ నగర్‌లో ఠాను నాయక్ 74వ వర్ధంతిని పురస్కరించుకోని ఆయన చిత్రపటానికి పూలమాలాలు వేసి నివాళిలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంబాడీ గిరిజనుల ఉద్యమాల సూర్యుడు ఠానునాయక్ వర్ధంతిని తెలంగాణ రాష్ట్రంలోని లంబాడీ, బంజారా తాండాలో ప్రతి సంవత్సరం మార్చి 20న ఘనంగా జరుపుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జాదవ్ గోపాల్ రావు, మాజీ సర్పంచ్ జాదవ్ హరి నాయక్, పవర్ విజయ్ కుమార్, కవి మురళి, నాయాకులు జాదవ్ వసంత్ రావు, బానోత్ రవీందర్, సుధాకర్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి స్వాగతం పలికిన జెడ్పీ చైర్మెన్

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదిలాబాద్ జిల్లాకు విచ్చేసిన కేంద్రమంత్రి అర్జున్ ముండాకు జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. బుధవారం ఆదిలాబాద్ పార్లమెంట్ స్థాయి సమీక్ష సమావేశానికి కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా జిల్లాకు వచ్చారు. బీజేపీ ఎంపీ అభ్యర్థిని ఆదిలాబాద్ నుండి గెలిపించేల ప్రతి ఒక్కరు కృషి చేయాని కేంద్రమంత్రి సూచించినట్లు చైర్మెన తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగే బ్రహ్మానందం, పార్లమెంట్ కన్వీనర్ మయూర్ చంద్ర, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు దయకర్, నాయకులు పవార్ దేవిదాస్ పాల్గొన్నారు.

శబరిమాత ఆలయాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నవతెలంగాణ-బోథ్

శబరిమాత ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని కౌట(బి) గ్రామంలో శ్రీ శబరిమాత వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శబరిమాత వారి దివ్య ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని అన్నారు. ప్రజలు దైవ మార్గంలో నడవాలని ప్రతి ఒక్కరూ భక్తి భావనలతో నడవాలనీ అన్నారు. కార్యక్రమంలో ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్, మండల కన్వీనర్ నారాయణ్ రెడ్డి, గంగాధర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూటర్న్ కెరీర్ గైడెన్స్‌తో విద్యార్థులకు మంచి విద్యనందించాలి

నవతెలంగాణ-బోథ్



యూటర్న్ కెరీర్ గైడెన్స్‌లతో విద్యార్థిని విద్యార్థులకు మంచి విద్యను అందించాలని తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని యూటర్న్ కెరీర్ గైడ్స్‌ను సందర్శించి మాట్లాడారు. మంచి విద్య కేంద్రాన్ని బోథ్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నిర్వాహకులు రమణగౌడ్, అల్లం సాయికృష్ణలను అభినందించారు. గ్రామీణ ప్రాంతమైన బోథ్ కేంద్రంలో ఇలాంటి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడం గర్వకారణమని అన్నారు. అలాగే నిరుద్యోగులు, విద్యార్థులు ఆన్‌లైన్ క్లాసులు కెరీర్ గైడెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నిర్వాహకులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఎండల తీవ్రతపై నేడు మండల సమావేశం

నవతెలంగాణ-దిలావర్‌పూర్

వేసవి ఎండల తీవ్రత పట్ల ప్రజలకు పలు సూచనలు జారీ చేయుటకు నేడు మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు మండల పరిషత్ సమావేశం నిర్వహించబడునని ఎంపీడీఓ అరుణరాణి బుధవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పశు వైద్య అధికారులు, అటవీశాఖ అధికారి, విలేకరులు హాజరుకావాలని కోరారు.

వేసవికాలం ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-నిర్మల్

వేసవికాలం నేపథ్యంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టొరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, వైద్య, మున్సిపల్ శాఖల అధికారులతో వేసవి నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వేసవి నేపథ్యంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, వైద్య, మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో గ్రామ, వార్డు సభలు నిర్వహించి, ఎండల తీవ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అలాగే బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ముఖ్యకూడళ్లు, ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాలలో ఉచిత ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పట్టణ, మండల, గ్రామీణ ప్రాంతాల ముఖ్య కూడళ్లలో ఎండ తీవ్రత నుండి రక్షణ, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. వైద్యశాఖ ద్వారా రూపొందించిన ఆడియోను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. వడదెబ్బకు గురైన వారికి సూచించాల్సిన జాగ్రత్తలపై ఏఎన్ఎం, ఆశా వర్కర్లకు, హెల్త్ సూపర్‌వైజర్‌లకు శిక్షణలు అందించాలని అన్నారు. పని ప్రదేశాలలో కార్మికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా బస్ స్టాండులు, రైల్వే స్టేషన్లు, రద్దీ ప్రదేశాలు, కార్యాలయాలు, దేవాలయాలు వంటి ప్రదేశాలలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఉచిత తాగునీటి సౌకర్యం, చలివేంద్రం ఏర్పాటు చేయాలనీ అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ తాగునీరు ప్రతి ఇంటికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి సమస్యల పరిష్కారం, తక్షణ సహాయం కోసం ప్రజలు కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ - 6305646600 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. అలాగే వేసవిలో అగ్ని ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అటవీ ప్రాంతాలలో జంతువులకు నీటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని అటవీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, నిర్మల్, భైంసా ఆర్డీఓలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, డీఆర్డీఓ విజయలక్ష్మి, జిల్లా వైద్యశాఖ అధికారి ధన్‌రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ గోవింద్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. స్వీప్ ఆధ్వర్యంలో బుధవారం పాలిటెక్నిక్ కళాశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్టీయూ భవన్‌లో ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అంతకు ముందు ర్యాలీలో తెలంగాణ సంస్కృతిక కళాకారులు పాటలు పడుతూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో మాట్లాడుతూ తాము చదువుకునే సమయంలో ఓటరు నమోదుకు ఇలాంటి సౌకర్యాలు లేకుండేవని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసేలా ఎన్నికల సంఘం సూచనల మేరకు కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఫాం-6 పూరించి తహసీల్దార్ లేదా సంబంధిత బీఎల్ఓలకు అందించాలని సూచించారు. అదే విధంగా ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరుగా నమోదు చేసుకోవడమే కాకుండా మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో యువత ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. మోడల్ కోడ్ అమలులో ఉందని, ఎవరైన ఓటర్లను ప్రలోభలకు గురైనట్లు తెలిస్తే వెంటనే సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, రూరల్ తహసీల్దార్ దీలిప్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ భరద్వాజ పాల్గొన్నారు.



అనాధిగా మన సంస్కృతిపై దాడి

- కేంద్రమంత్రి అర్జున్ ముండా

నవతెలంగాణ-తలమడుగు

అనాధిగా మన సంస్కృతిపై దాడి జరుగుతోందని కేంద్రమంత్రి అర్జున్ ముండా అన్నారు. బుధవారం మండలంలోని ఉండం గ్రామం అయుషా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన పార్లమెంట్ స్థాయి సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సమావేశానికి వివిధ మండలాల, గ్రామాల నుంచి వచ్చిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దాదాపు 500 మంది కేంద్రమంత్రి అర్జునుముండా సమీక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా అర్జున్ ముండా మాట్లాడుతూ మన దేశంలో మన సంస్కృతిపై అనాదిగా దండయాత్ర జరుగుతూనే ఉందని తెలిపారు. మన సంస్కృతిని మన సాంప్రదాయాన్ని సమూలంగా నాశనం చేయాలని మొగలులు, బ్రిటిష్ వారు, ఇతర దేశస్తులు వందల సంవత్సరాలుగా ప్రయత్నం చేస్తూనే ఉన్నారని అన్నారు. అదే విధంగా పరంపరను కొనసాగిస్తూ దేశంలోని కొన్ని రాజకీయ పార్టీలు కూడా మన సనాతన ధర్మంపై దండయాత్ర కొనసాగిస్తూ ఉన్నారని తెలిపారు. దేశంలో రామరాజ్యం కావాలంటే ముచ్చటగా మూడోసారి మోడీని ప్రధానమంత్రి చేయాలని కోరారు. దేశంలో ఆదివాసుల ఉనికికి ప్రమాదం ఏర్పడిందని అన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ మోడీ నాయకత్వంలో దేశంలో పాలన స్వర్ణయుగంలా నడుస్తుందని అన్నారు. గల్లీలో ఎవరున్నా ఢిల్లీలో మాత్రం మోడీ ఉండాలని అన్నారు. ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ గతంలో ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రిగా పనిచేసిన అపార అనుభవం గల మన ఎంపీ అభ్యర్థి నగేష్ బీజేపీలో చేరడం అదృష్టంగా భావించాలని అన్నారు. ఆదిలాబాద్ ఎంపీ సీటును గెలిపించి, మోడీకి కానుకగా అందించేందుకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ మాట్లాడుతూ రాజకీయ ప్రస్థానంలో మోడీ లాంటి నాయకుడిని ఇంతవరకు చూడలేదని అన్నారు. కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మవద్దని అన్నారు. కేంద్రమంత్రి అర్జున్ ముండా సమీక్షంలో బీజేపీలో చేరిన వారిలో తాంసి జెడ్పీటీసీ రాజు, తలమడుగు మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు అయ్యన్నగారి భూమయ్య, బ్రహ్మానంద్, అంకత్ రమేష్, ముస్తఫా, అశోక్, మయూర్ చంద్ర, సుహాసినిరెడ్డి, చిలుకూరి జ్యోతి, సుభాష్, వేదవ్యాస్, రాందాస్, స్వామి, ప్రవీణ్, కనపర్తి చంద్రకాంత్, బోండ్ల వెంకటస్వామి, గేల్లా మహేందర్ యాదవ్, అరుణ్, పులి నర్సింగ్, వివిధ మండలాల నుంచి గ్రామాల నుంచి వచ్చిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన తాంసీ, భీంపూర్ నాయకులు

తాంసి : తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు బుధవారం అయుషా గార్డెన్‌లో బీజేపీ కేంద్రమంత్రి అర్జున్ ముండా సమక్షంలో చేరారు. చేరిన వారిలో తాంసి జెడ్పీటీసీ తాటిపల్లి రాజు, తాంసి మండలం బీఆర్ఎస్ కన్వీనర్ అరుణ్ కుమార్, కప్పర్ల సర్పంచ్ సదానందం, లింబుగూడ సర్పంచ్ సంబు, భీంపూర్ మండలంలోని అర్లి(టి) మాజీ ఎంపీటీసీ గంగయ్య, అంతర్గాం గ్రామానికి చెందిన స్వామి యాదవ్, తాంసి మాజీ జెడ్పీటీసీ నారాయణలతో పాటు రెండు మండలాలకు చెందిన వారు బీజేపీలో చేరారు వారికి కేంద్ర మంత్రి అర్జున్ ముండా బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మొదటగా కేంద్రమంత్రికి పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేష్‌తో పాటు ఎమ్మెల్యే పాయల్ శంకర్, జెడ్పీ చైర్మెన్ జనార్ధన్‌తో పలువురు పూలమాల శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ మూడోసారి బీజేపీ ప్రభుత్వాన్ని కేంద్రంలో అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ అభ్యర్థి గోడం నగేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.



బీజేపీలో పలువురు బోథ్ బీఆర్ఎస్ నాయకులు

బోథ్ : మండలంలోని పీఏసీఎస్, చైర్మెన్‌లతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీ నుంచి బీజేపీలో చేరారు. బుధవారం నియోజకవర్గంలోని ఉండంలోని అయుషా గార్డెన్‌లో కార్యకర్తల సమావేశానికి కేంద్రమంత్రి అర్జున్ ముండా హజరయ్యారు. మాజీ మంత్రి గోడం నగేష్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. చేరిన వారిలో పీఏసీఎస్ చైర్మెన్ కదం ప్రశాంత్, ఎంపీటీసీలు జుగాదిరావు, మణిందర్ సింగ్, మాడవి దేవిదాస్, సర్పంచులు కొడప విజయ్, పెందుర్ లింగు, పీఎస్-సీఎస్ డైరెక్టర్ శ్రీను, మనోహర్, మాజీ ఎంపీపీ కిషన్, మాజీ సర్పంచ్‌లు రాజేశ్వర్, దివాకర్‌రెడ్డి, నాయకులు విజయ్, లింగు, భీమ్ రావు, రమేష్, హనుమంత్‌రావు, విష్ణు, రామారావు, బాపూరావు, విష్ణు, సోమనాథ్, పార్టీలో చేరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | మార్చి 21, 2024 | www.navatelangana.com

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని శిర్షా గ్రామంలో మేన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 186లో మూడెకరాల స్థలాన్ని కమలాకర్, గోపాల్‌రావు కబ్జా చేసి ట్రాక్టర్‌తో చదును చేసి ఒక్కొక్కరి దగ్గర లక్ష చొప్పున బయానరూపకంగా తీసుకున్నారని, ఆ స్థలాన్ని వారు ఎప్పుడు కాస్తు చేయలేదని, ఇప్పుడు కబ్జా చేసి ప్లాట్లు చేసి అమ్ముతున్నారని గ్రామస్తులు తహసీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. ఈ కబ్జా స్థలాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని శిర్షా గ్రామానికి ఆటస్థలం, గ్రామ పంచాయతీ కార్యాలయానికి, అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించాలని కోరారు. తహసీల్దార్ పుష్పలత రికార్డులను పరిశీలించి ఈ స్థలాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని కబ్జాదారులపై చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. ఇందులో శంకర్, జగ్గయ్య, అల్లి తిరుపతి, మల్లేష్ ఉన్నారు.



బీఆర్ఎస్ నాయకుల పార్లమెంట్ స్థాయి సమావేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదిలాబాద్ పార్లమెంట్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అధ్యక్షతన ఆదిలాబాద్ కేంద్రంలో జరిగింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, బోథ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు అనిల్ జాధవ్, కోవలక్ష్మీ, మాజీ మంత్రి జోగు రామన్న, ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్‌లతో కలిసి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థిగా తనకు అవకాశం ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. తన గెలుపు కోసం బీఆర్ఎస్ శ్రేణులు సమన్వయంతో పని చెయ్యాలని కోరారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్



నవ తెలంగాణ-ఆసిఫాబాద్

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు మంజూరు చేయాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణపురం మహేష్, పర్వతి రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, డీపీఆర్ఓ సంపత్‌లను సంఘం జాతీయ కౌన్సిల్ సభ్యుడు సురేందర్ రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నీలి సతీష్, ఇతర కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జర్నలిస్టులకు ఇండ్ల సలాలు మంజూరు చేయలేదని, దీనివల్ల అనేక మంది పేద జర్నలిస్టులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇండ్లు మంజూరు చేయాలన్నారు. జర్నలిస్టుల ఇతర సమస్యలు కూడా పరిష్కరించాలని కోరారు. దీనికి జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉందని, కోడ్ ముగిసిన తర్వాత జర్నలిస్టులతో సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి కృష్ణ మోహన్ గౌడ్, సభ్యులు నాగేందర్, ఎండీ ఇసాక్, విష్ణుగౌడ్, జలీల్, దాసరి లక్ష్మణ్, సంతోష్, సదాశివ్ పాల్గొన్నారు.

సమస్యలుంటే పోలీసులను సంప్రదించాలి



నవతెలంగాణ-దహెగాం

ప్రజలు ఎలాంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తారని కాగజ్‌నగర్ రూరల్ సీఐ అల్లం రాంబాబు అన్నారు. బుధవారం మండలంలోని ఇట్యాల, కల్వాడ తదితర గ్రామాలను సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికలు కోడ్ ఉన్నందున ప్రజలందరు ఎన్నికల నిబంధనలను పాటించాలన్నారు. ఎవరు కూడా రూ.50 వేల కంటే ఎక్కువగా తీసుకెళ్లకూడదని, ఒకవేళ తీసుకెళ్లిన సంబంధిత ధృవీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. అలాగే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు సూచనలు తెలియజేశారు. అనంతరం కల్వాడ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టును పరిశీలించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సకాలంలో పూర్తి చేయాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఒక్కరు లబ్ధిపొందాలని ఎంపీడీఓ సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం ద్వారా నిర్మిస్తున్న వ్యక్తిగత మరుగుదొడ్ల వివరాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా నిర్మిస్తున్న మరుగుదొడ్లను సకాలంలో పూర్తిచేసుకొని నిధులను పొందాలని, వీటిని ఉపాధిహామీ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పూర్తిచేసేలా వారికి సహకరించాలని అన్నారు. ఆయన వెంట ఏపీఓ చంద్రయ్య, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పోషణ పక్షోత్సవాలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ఇందిరానగర్, జైభీంకాలనీ అంగన్‌వాడీ కేంద్రాలలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణీలకు సాంప్రదాయబద్ధంగా శ్రీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. గర్భిణీలు, బాలింతలు, కిషోర బాలికలు, చిన్నారులలో పౌష్టికాహారలోపాన్ని అధిగమించి వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే ఐసీడీఎస్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారి పుష్పలత, సూపర్‌వైజర్ రుతుక్లారా, ఎఎన్ఎం రమాదేవి, ఆర్పీ రాజేశ్వరి, వార్డు మహిళా సంఘం నాయకురాలు కమల, అంగన్‌వాడీ టీచర్లు త్రివేణి, రాణి, ఆశ కార్యకర్తలు పద్మ, సరస్వతి, ఆయా సువర్ణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న అవిశ్వాసాల పర్వం

- మొన్న కాగజ్‌నగర్ మున్సిపాలిటీ
- నేడు సిర్పూర్ మండల పరిషత్
- జిల్లాలో ఆసక్తి రేకెత్తిస్తున్న రాజకీయాలు
- 30న సిర్పూర్ ఎంపీపీపై అవిశ్వాసం



సిర్పూర్ ఎంపీడీఓ కార్యాలయం

నవతెలంగాణ-సిర్పూర్(టి)

రాష్ట్రంలో అధికారం మారడంతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. బీఆర్ఎస్ కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీ తమ పదవులకు రాజీనామా చేసి కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. జిల్లాలో అవిశ్వాస తీర్మానాలతో రాజకీయం వేడెక్కింది. మొన్న కాగజ్‌నగర్ మున్సిపాలిటీ, నేడు సిర్పూర్ మండల పరిషత్‌పై అవిశ్వాసానికి ఎంపీటీసీలు సిద్ధంగా ఉన్నారు. ఈక్రమంలోనే ఆర్డీఓకు పత్రాన్ని సైతం అందించారు. ఈనెల 30న బలపరీక్ష జరగనుంది. కాగా దీనిపై సదరు ఎంపీపీ కోర్టు స్టే తీసుకువచ్చిన ఫలితం లేకుండా పోయింది.

ఎంపీపీ గౌరవించడం లేదు..

ఎంపీపీ చునార్కర్ సువర్ణ తమను పట్టించుకోవడం లేదని ఆరుగురు ఎంపీటీసీలు ఆరోపించారు. ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటు, అభివృద్ధి కార్యక్రమాలకు తమను ఆహ్వానించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులను కూడా దుర్వినియోగం చేస్తున్నారని, నాలుగేండ్ల పాలనలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని, సంక్షేమపథకాలను పేదలకు అందించాలేదని ఆరోపిస్తున్నారు. ఎంపీపీపై అవిశ్వాసం పెట్టేందుకు ఆరుగురు ఎంపీటీసీలు సిద్ధం అయ్యారు. గత నెలలోనే ఆర్డీఓకు ఎంపీటీసీలు అవిశ్వాసంపై నోటీసు ఇచ్చారు. ఈనెల 27న సమావేశానికి ఆర్డీఓ ఆదేశాలు జారీ చేశారు.

కోర్టును ఆశ్రయించిన.. దక్కని ఫలితం

గత నెల 27న ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఆర్డీఓ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై సదరు ఎంపీపీ కోర్టును ఆశ్రయించారు. గత నెల 16న హైకోర్టు ద్వారా సమావేశం జరుగకుండా మధ్యంతర ఉత్తర్వులు తీసుకువచ్చారు. ఎంపీటీసీలు కూడా వెనక్కి తగ్గకుండా హైకోర్టులో తమ వాదనలు పరిగణలోకి తీసుకొని హైకోర్టు 30వ బెంచీ న్యాయమూర్తి శరత్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ ఆర్డీఓ సురేష్ తిరిగి ఎంపీటీసీలకు ఈ నెల 30న ప్రత్యేక సమావేశం నిర్వహించుకోవాలని నోటీసులు జారీ చేశారు. రెండో తేదీన నూతన పాలక మండలి కొలువు తీరాలని ఆదేశించారు. దీంతో మండల పరిషత్‌పై అవిశ్వాసం నెగ్గేనా, వీగిపోయేనా అనే ఉత్కంఠ ప్రజల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

ప్రజల కోసమా.. పదవుల కోసమా..?

ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు ఎవరి కోసం పని చేస్తున్నారా అనేది అంతుచిక్కని వ్యవహారంలా మారుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సమీకరణలు మారి అనూహ్యంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. సర్పంచ్ నుంచి మొదలుకొని పెద్ద పదవుల్లో కొనసాగిన కీలక నాయకులు పార్టీ ఫిరాయించారు. ఇది ఒక ఎత్తు అయితే.. మరోవైపు స్థానిక సంస్థల్లో అవిశ్వాసాల పర్వం. మరో కొన్ని నెలల్లో పదవి కాలం ముగియనుంది. అయితే పదవుల కోసం కొందరు అవిశ్వాసలు పెడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. నాలుగేండ్లుగా స్తబ్దుగా ఉన్న వారు ఇప్పుడు ఎందుకు అవిశ్వాసం పెడుతున్నారో అర్థం కావడం లేదని మండల వాసులు చర్చించుకుంటున్నారు.

ఎస్పీఎం కుట్రలను మానుకోవాలి



కమిషనర్‌కు అభినందన పత్రం అందిస్తున్న ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లు యాజమాన్యం కొన్నేండ్ల క్రితం రహదారులకు అడ్డంగా నిర్మించిన గోడలను ఇటీవల మున్సిపల్ అధికారులు తొలగిస్తే, మళ్లీ వాటి స్థానంలో తిరిగి గోడలను నిర్మించే కుట్రలను ఎస్పీఎం యాజమాన్యం మానుకోవాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. మంగళవారం మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ ఛైర్‌పర్సన్ షాహీన్‌సుల్తానాలను నాయకులు కలిసి వినతిపత్రాలు ఇవ్వడంతో పాటు వారిని అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ ప్రకారం కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మాణం చేసి అక్రమ నిర్మాణాలను తొలగిస్తే జీర్ణించుకోలేని యాజమాన్యం కవ్వింపు చర్యలకు పూనుకుంటోందన్నారు. మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్‌లపైనే అక్రమ కేసులు బనాయించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అయిన మున్సిపల్ అధికారులు, పాలకవర్గం ఏకతాటిపై నిలిచి ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతుండడాన్ని తాము అభినందిస్తున్నామని తెలిపారు. మిల్లు ప్రారంభమై ఆరేండ్లు కావస్తున్నా ఇప్పటికీ 190 మందికి పైగా పర్మినెంట్ కార్మికులను విధుల్లోకి తీసుకోలేదని, సుమారు 1000 మంది కాంట్రాక్టు కార్మికులు కూడా విధులకు దూరంగా ఉన్నారని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించకపోగా, కుట్రలు, కుతంత్రాలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు జయదేవ్, జి నాగేశ్వర్‌రావు, బి నర్సయ్య, తాజుద్దీన్, అంబాల ఓదేలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే



పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

నవతెలంగాణ-రెబ్బెన

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లాఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. బుధవారం మండలంలోని గంగాపూర్ పోలింగ్ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ సురేష్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలను జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాలోని సిర్పూర్‌లో 320 పోలింగ్ కేంద్రాలు, ఆసిఫాబాద్‌లో 356 పోలింగ్ కేంద్రాలు ఉండగా సహాయక పోలింగ్ కేంద్రాలతో మొత్తంగా 676 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసి బూత్‌స్థాయి అధికారులు, సూపర్‌వైజర్‌లను నియమించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలో తొమ్మిది స్టాటిక్ సర్వేలెన్స్ టీంలు, ఎనిమిది ఫ్లైయింగ్‌స్క్వాడ్ బృందాలు, తొమ్మిది వీడియో సర్వేలెన్స్ టీంలు, రెండు వీడియో పరిశీలన బృందాలు, ఎనిమిది మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు, రెండు అకౌంటింగ్ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు లోక్‌సభ ఎన్నికల కార్యాచరణ ప్రకారం జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో సమీకృత కంట్రోల్ రూం, జిల్లా గ్రీవెన్స్ కమిటీ, మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీలను ఏర్పాటుచేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో దివ్యాంగ ఓటర్లను పోలింగ్ కేంద్రాల వారీగా మ్యాపింగ్ చేసుకోవాలని, పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, లైటింగ్, ర్యాంపు, నీటి సరఫరాతో కూడిన మూత్రశాలలు, మౌళిక సదుపాయాలు కల్పించాలని, పోలింగ్ కేంద్రానికి రాలేని దివ్యాంగులు, వయోవృద్ధులకు వారి ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకొనేలా అవకాశం కల్పించామని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోష్ణ, సీఐ చిట్టిబాబు, ఎస్ఐ చంద్రశేఖర్, ఆర్ఐ ప్రేమ్‌కుమార్, పర్సనల్ సెక్రటరీ మురళీ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలతో యువతలో ప్రోత్సాహం



నవతెలంగాణ-జైనూర్

క్రికెట్ పోటీలతో యువతలో ప్రోత్సాహం ఉంటుందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని ఉషేగావ్ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నెల నుండి క్రికెట్ ఈ టోర్నమెంట్ నిర్వహించారు. అందులో భాగంగా ఫైనల్ మ్యాచ్‌లో జైనూర్ మండలానికి చెందిన వసీమ్ ఎలెవన్‌స్టార్ మొదటి బహుమతి రూ.15 వేల నగదుతో పాటు ట్రోఫీని అందించారు. రెండో బహుమతి సిర్పూర్(యు) మండలానికి చెందిన పిట్టగూడ ఎలవెన్‌స్టార్‌కు రూ.ఏడు వేల నగదుతో పాటు ట్రోపీని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. క్రీడలతో యువతలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయవచ్చని అన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించి యువతను ప్రోత్సహించడం గొప్పదని ఉషేగావ్ గ్రామస్తులను అభినందించారు. అనంతరం టోర్నమెంటులో నవీన్‌కుమార్‌కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా ఎస్ఎన్‌జే సొసైటీ ఆధ్వర్యంలో బహుమతి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు క్రీడాకారులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, వైస్ ఎంపీపీ చిర్లె లక్ష్మణ్, బీఆర్ఎస్ జిల్లా నాయకురాలు మర్సకోల సరస్వతి, స్థానిక ఎంపీటీసీ కుమ్ర భగవంత్‌రావు, మాజీ ఎంపీటీసీ జలపత్, మెస్రం నాగోరావు, ఉషేగావ్ గ్రామ టోర్నమెంటు మేనేజిమెంట్ సభ్యులు పటేల్, అమృత్‌రావు, కేశవరావు, క్రీడాకారులు, జైనూర్ ఎంపీటీసీ(2) బీబీనూర్, నాయకులు అజ్జులాల పాల్గొన్నారు.

డయాలసిస్ పేషెంట్లను ఆదుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని డయాలసిస్ పేషెంట్లు పడుతున్న ఇబ్బందులను తొలగించి వారిని ఆదుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కాంద్రే విశాల్ కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం డయాలసిస్ పేషెంట్లకు సంబంధించి ఇబ్బందులను వివరిస్తు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయాలిసిస్ పేషెంట్లకు న్యాయం చేయాలని, కరెంట్ లేని సమయంలో డయాసిస్ చేస్తుండగా పేషెంట్లు చాలా తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారన్నారు. పేషంట్ల వద్ద నుండి డీజిల్ ఖర్చుల కోసం అక్కడి సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ప్రెసిడెంట్ గణేష్ పాల్గొన్నారు.



ఆదివాసుల అభివృద్ధికి పటిష్ట చర్యలు

- ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదివాసుల అభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా అన్నారు. గురువారం మండలంలోని రౌట సంకేపల్లి గ్రామంలో జరుగుతున్న అభివృధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు సత్రవేణి మల్లేష్, కొండు, ఐటీడీఏ అసిస్టెంట్ ఇంజనీర్ నజీమోద్దీన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పోషణ పక్షోత్సవం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. నందిగూడ, పర్ధాన్ గూడ కేంద్రాల్లో గర్భిణీలకు శ్రీమంతం, ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన చేశారు. ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజిని మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపం అధిగమించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే ఐసీడీఎస్ లక్ష్యమన్నారు. తల్లిపాలపై అవగాహన, చిరుధాన్యాల గురించి పౌష్టికాహారంతో కూడిన పంటల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పంజీరి ప్రత్యేకాధికారి గోపిచంద్, సబ్ యూనిట్ ఆఫీసర్ అనీసోద్దిన్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

మిగిలిన సీట్లకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ సాంఘిక సంక్షేమ, గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ ఉటూరి శ్రీనాథ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 23లోపు దరఖాస్తు చేసుకోవాలని ఇతర వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

రంజాన్ రేషన్ కిట్ల పంపిణీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

దారుల్ అన్సార్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మైనార్టీ ఫంక్షన్ హాలులో రంజాన్ రేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రధాన కార్యదర్శి ముఫకం అహ్మద్ మాట్లాడుతూ కాగజ్‌నగర్‌లో 18 మంది వాలంటీర్లు సర్వే నిర్వహించి అర్హులైన 170 మంది పేదలను గుర్తించారని, వారికి రూ. 500తో పాటు బియ్యం, రేషన్ కిట్లను అందించినట్లు తెలిపారు. వృద్ధ మహిళలకు, వితంతువులకు కూడా రూ. 200తో పాటు రేషన్ కిట్లను అందించామని తెలిపారు. ట్రస్టు సంయుక్త కార్యదర్శి హఫీజ్ రియాజ్ తన తరపున 20 మందికి రేషన్ కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కోశాధికారి అబ్దుల్‌రహీం మల్నాస్, ఉపాధ్యక్షులు అబ్దుల్ షాకీర్, సభ్యులు అబ్దుల్ ముఖీమ్, ముస్తయిద్ అలీ, నసీర్, తయ్యబ్ బిన్ ఈసా, అబ్దుల్ సత్తార్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ యువతీయువకులకు ప్రభుత్వం వెంటనే సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రూప్నర్ రమేష్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ నిరుద్యోగ యువకులకు 2018లో దాదాపు 4000 మంది నిరుద్యోగులు బీసీ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోగా అందులో కేవలం 529 మందికి మాత్రమే రుణం అందించారని, మిగతా వారికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సబ్సిడీతో కూడిన రుణాలను జిల్లాలోని నిరుద్యోగులకు అందజేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పురుషోత్తం బాలేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల జక్కయ్య, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్, బీసీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వైరాగడే మారుతీ పటేల్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డల శంకర్, రైతు సంఘం ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు బాల్దరపు మధుకర్ పాల్గొన్నారు.

సృష్టి ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ రాజ్‌కుమార్‌కు సన్మానం

నవతెలంగాణ-నస్పూర్



సృష్టి ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ అంబాల రాజకుమార్‌ను నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ సర్వీస్ అండ్ సోషల్ జస్టిస్ చేంజ్ ఫర్ ఇండియా జిల్లా ఇన్‌చార్జి గోదారి వెంకట సాయి ఆధ్వర్యంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడు మంగళంపల్లి హుస్సేన్, నస్పూర్ ఎస్సై రవికుమార్ ఉత్తమ పౌర సేవ పురస్కారాన్ని అందజేసి సన్మానించారు. మంచిర్యాల జిల్లాలో సృష్టి ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో రాజ్‌కుమార్ చేస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రయివేట్ పాఠశాలల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రెగళ్ళ ఉపేందర్, స్టేట్ కమిటీ మెంబర్ ప్రభాకర్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ సాయిని స్వామి, మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రెటరీ సాయి కుమార్, జిల్లా సభ్యులు అరుణ్ తేజ, నీలం సురేందర్, చెన్నూర్ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ

నవతెలంగాణ-హాజీపూర్



లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రం ర్యాలీ నిర్వహించారు. లక్ష్మీ టాకీస్ నుంచి ఐబీ చౌరస్తాలో ట్రాన్స్‌పోర్టు కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. లారీ ఓనర్స్ మాట్లాడుతూ తమ న్యాయ మైన డిమాండ్ల పరిష్కారం కోసం రెండు రోజులుగా సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. డిమాండ్లను పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

పౌష్టికాహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

● మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ సౌజన్య



నవతెలంగాణ-జైపూర్

గర్భిణులు పౌష్టికాహారానికి ప్రాధాన్యత ఇవ్వాలని మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ సౌజన్య సూచించారు. పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మిట్టపల్లి గ్రామంలోగల అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజు వారిగా తీసుకునే ఆహారంలో తృణ ధాన్యాలు తీసుకోవాలని సూచించారు. వాటితో కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహణ కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వార అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించిన ఆమె ప్రీస్కూల్ ఎడ్యూకేషన్ ద్వార 3 నుంచి 60 సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తెలిపారు. 6 నెలల వయస్సు గల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలలో అన్నప్రసన, 3 సంవత్సరాల పిల్లలకు అక్షరాభ్యాసం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతి కార్యదర్శి ప్రవీణ్ కుమార్, డాక్టర్ కమలాకర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడి టీచర్లు సరోజ, నిరోష, లావణ్య పాల్గొన్నారు.

జన్నారం : మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణపక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు జాడి సంజీవరాణి గంజాయిలా జమున, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం, ముర్రుపాలు ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం పోషణ ప్రతిజ్ఞ యించారు. గర్భిణీలు బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి చిన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో గర్భిణీలు కిశోర బాలికలు చిన్నారులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి విధిగా పాటించాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఎన్నికల నియమావళి ప్రతి ఒక్కరు విధిగా పాటించాలని, నిరసన కార్యక్రమాలు, ధర్నాలు చేయకూడదని లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్ సూచించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని మోదల, లక్షెట్టిపేట, ఇటిక్యాల, పోతేపల్లి, గుల్లకోట, సూరారం, మిట్టపల్లి గ్రామాలకు చెందిన రైతుల పొలాల గుండా నేషనల్ హైవే-63 వెళుతున్న కారణంగా భూములు కోల్పోతున్న రైతులు గత కొన్ని రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్న నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అదేవిధంగా పదో తరగతి పరీక్షలు దృష్ట్యా సాధారణ ప్రజలకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు సంబందిత రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. వారితో రోడ్ల పైన ఎలాంటి నిరసన కార్యక్రమాలు గాని ధర్నాలు చేపట్టరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాదాపు 20 మంది రైతులు ఎస్ఐ పి.చంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

● జైపూర్ తహసీల్దార్ వనజారెడ్డి



నవతెలంగాణ-జైపూర్

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నందున 18 సంవత్సరాల వయస్సు గల వారందరు విధిగా ఓటరు నమోదు చేసుకోవాలని స్థానిక తహసీల్దార్ వనజా రెడ్డి సూచించారు. స్థానిక ఎస్ఐ శ్రీధర్‌తో కలిసి బుధవారం మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. నామినేషన్ల ముందు రోజు వరకు ఓటరు నమోదు కార్యక్రమం కొనసాగుతుందని బీఎల్ఓలకు తెలిపారు. ఓటరు లిస్టులో మార్పులు, చేర్పులకు అవకాశం లేకపోయినా కొత్తగా ఓటరు నమోదుకు అవకాశమున్నట్లు తెలిపారు. కాగా మండల పరిధిలో గల 35 పోలింగ్ స్టేషన్లలో పెగడపల్లి నుంచి శివ్వారం వరకు గల 18 పోలింగ్ స్టేషన్లు పరిశీలించినట్లు తెలిపారు. పోలింగ్ స్టేషన్ల స్థితిగతులు, అత్యవసర వసతుల కల్పన, పోలింగ్ స్టేషన్ల పరిసరాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ తిరుపతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి నియామకం

నవతెలంగాణ-లక్షెట్టిపేట



కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా బియ్యాల తిరుపతిని నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, స్థానిక ఎమ్మెల్యే కొక్కిరా సురేఖ, ప్రేమ్‌సాగర్‌రావులు బుదవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో పీఎస్ఆర్ గెలుపే లక్ష్యంగా పనిచేశానని ఇప్పుడు ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవిని కట్టబెట్టిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, సురేఖలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

22న పెరిక కుల సంఘం సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-హాజీపూర్

22న జిల్లా పెరిక సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు బేర సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాకు కమిటీల కాల పరిమితి ముగిసిందని తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు మంచిర్యాలలోని ఎస్ కన్వెన్షన్ హాల్, బైపాస్ రోడ్డులో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పాత గ్రామ, పట్టణ, మండల, జిల్లా కమిటీలను రద్దు చేయడం, నూతన కమిటీల ఎన్నిక ఉంటుందని వివరించారు. మంచిర్యాల జిల్లా పెరిక కులబాందవులు అందరూ సకాలంలో హాజరు కావలని కోరారు.

వరి ధాన్యం దొంగల అరెస్టు

● రూ.59 వేల నగదు, 20 బస్తాలు స్వాధీనం



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రంలోని వ్యవసాయ గిడ్డంగిలో వరి ధాన్యం బస్తాలు దొంగలించిన ఐదురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు శ్రీరాంపూర్ సీఐ మోహన్ బుధవారం స్థానిక ఎస్ఐ రాములుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మద్యంకు అలవాటుపడి అవసరాలు తీర్చుకోవడం కోసం రోజు వారి కూలీ డబ్బులు సరిపోక వరి ధాన్యం బస్తాలు దొంగలించిన వారిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చుతున్నట్లు తెలిపారు. భీమారం గ్రామానికి చెందిన మల్లెత్తుల ప్రశాంత్ (29) దాసరి చంద్రమౌళి (38), పందుల మధూకర్(38), బొంతల మధూకర్(30) మల్లెత్తుల రమేష్ (25) హమాలీలుగా పని చేస్తూవుండే వారు. ఈ క్రమంలో భీమారం గిడ్డంగితో పాటు పరిసర ప్రాంతాలలో వరి ధాన్యం బస్తాలు మోయడం కోసం వెలుతుంటారు. భీమారం వ్యవసాయ గిడ్డంగిలో అంకుషాపూర్‌కు చెందిన దర్శనాల రమేష్‌కు చెందిన దుర్గ ఇండస్ట్రీస్ రైస్ మిల్‌కు సంబంధించిన వరి ధాన్యం బస్తాలు ఇక్కడి గిడ్డంగిలో బద్రపర్చుకున్నాడు. ధాన్యం బస్తాలు మోస్తున్న క్రమంలో దర్శనాల రమేష్‌కు సంబంధించిన వరి ధాన్యం బస్తాలు దొంగలించాలని ముందుగా వేసుకున్న పథకం ప్రకారం ధాన్యం బస్తాలను దొంగలించారు. గత రెండు నెలలుగా రమేష్‌కు చెందిన75 దొంగలించి ఆటో ట్రాలీలో వేసుకుని మహారాష్ట్రలో గల సిర్వొంచ వైపు వెళ్లి గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మి వచ్చిన డబ్బులను అందరు సమంగా పంచుకున్నారు. అదే ప్రకారం ఈ నెల 16న మరోమారు దర్శనాల రమేష్‌కు చెందిన వరి ధాన్యం బస్తాలు 20 రాత్రి సమయంలో దొంగలించి ఆటో ట్రాలీలో తరలిస్తున్న క్రమంలో ఎరుకలి కొండయ్య అనే వ్యక్తి గమనించి వరిధాన్యం బస్తాల యజమాని దర్శనాల రమేష్‌కు తెలియపర్చాడు. దొంగతనం జరిగిన తీరుపై నిజనిర్ధారణ చేసుకున్న రమేష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన స్థానిక ఎస్ఐ రాములు బుధవారం వరిధాన్యం బస్తాలతో ఉన్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.59 వేల నగదు 20 బస్తాల వరి ధాన్యం, రెండు ఆటో ట్రాలీలు స్వాధీనం చేసుకున్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నా

● ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల శాసనసభ సభ్యునిగా ఎన్నికైన వంద రోజుల్లోనే నియోజకవర్గ అభివృద్ధి కోసం వందల కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు వెల్లడించారు. బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కేవలం వంద రోజుల్లోనే భారీగా నిధులు మంజూరు చేయించానని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో మిగతా నిధులు నిలిచిపోయాయని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గంలో సాగునీరు, తాగునీరు, మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు వివరించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాటశాలలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి కలెక్టర్, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశం సత్ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారని చెప్పారు. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం ప్రహరిగోడ నిర్మాణం, విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు పెద్ద మొత్తంలో నిధులు తీసుకువచ్చానని తెలిపారు. అలాగే పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు మహిళా సంఘాలకు పాఠశాల యాజమాన్య బాధ్యతలు అప్పగించడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. డ్వాక్రా సంఘాల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మంచిర్యాలలో అదనంగా రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గోదావరి పై వంతెన నిర్మాణం ఖచ్చితంగా జరుగుతుందని అయితే అది ముల్కల్ల ప్రాంతంలో నిర్మించే యోచనలో ఉన్నట్లు చెప్పారు. కాలేజ్‌రోడ్ నుంచి అంతర్గాము వరకు బ్రిడ్జి నిర్మాణం కేవలం మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు కోసమేనని నేను స్వార్థంతో కాకుండా ప్రజల సుదీర్ఘ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ వేణు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ అధ్యక్షులు తూముల నరేష్, బండారు సుధాకర్ పాల్గొన్నారు.

జీవనదుల పరిరక్షణ అందరి బాధ్యత

● ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 'సేవ్ గోదావరి-క్లీన్ గోదావరి'
● చెత్తాచెదారాన్ని తొలగించిన విద్యార్థులు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

కాలుశ్యాన్ని నివారించి పరియావరణ పరిక్షణలో భాగంగా జీవనదులను కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా అన్నారు. బుధవారం పట్టణంలోని గోదావరి నది ఒడ్డున పేరుకుపోయిన చెత్త చెదరాన్ని కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రోగ్రాం ఆఫీసర్ కుమారస్వామి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా మాట్లాడుతూ పరిశుభ్రమైన నీటితోనే సకల జీవరాసుల మనుగడ సాధ్యమవుతుందన్నారు. నీటి కాలుష్యం వలన అనేక అనర్థాలు కలిగి జీవకోటి మనుగడకు ముప్పు వాటిల్లుతుందని ఆయన వివరించారు. స్వచ్ఛమైన నీటితోనే అన్ని రకాల వృక్ష, జంతు జాతులు పరిరక్షించబడి ప్రకృతి సమతుల్యత సాధ్యమవుతుం దన్నారు. ముఖ్యంగా పండుగలు, ఇతర కార్యక్రమాల నేపథ్యంలో గోదావరి ఒడ్డున చెత్త వేయడం వలన నీరు కలుషితమై మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. అంతకుముందు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, రసాయన శాస్త్ర విభాగధిపతి కుమారస్వామి మాట్లాడుతూ గత ఐదేళ్లుగా కళాశాల విద్యార్థులతో కలిసి సేవ్ గోదావరి-క్లీన్ గోదావరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు సేవా దృక్పథం, జాతీయత అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు వివరించారు. సుమారు 75 మంది విద్యార్థులు, అధ్యాపక బృందం గోదావరి నది ఒడ్డున చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీ గంగయ్య, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ రోజు అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం ఆర్డీఓ వి.రాములు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ సిహెచ్.సతీష్, సీఐ. ఆకుల అశోక్‌లతో కలిసి ఓటరు ప్రతిజ్ఞ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోక్సభ ఎన్నికలు-2024లో భాగంగా మే 13వ తేదీన ఓటరు జాబితాలో పేరు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకొని అభివృద్ధికి పాటుపడే సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో స్వీప్‌లో భాగంగా వాక్ టు పోలింగ్ బూత్, ఓటు వినియోగం, ప్రాముఖ్యత తెలియజేసేందుకు జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం, అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఏప్రిల్ 1 వరకు 18 సం.లు వయస్సు నిండే ప్రతి ఒక్కరు ఏప్రిల్ 15వ తేదీ లోగా తమ వివరాలు నమోదు చేసుకొని నూతన ఓటరు కార్డు పొందాలని తెలిపారు. జిల్లాలో దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్లను ఓటు వేసేలా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ ఎస్ఐ రవికుమార్, స్వీప్ సమన్వయకర్త రాంచందర్, బూత్ స్థాయి సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులు, ఆశ కార్యకర్తలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-తాండూర్

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని డీఎల్పీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. మిషన్ భగీరథ, నీటిపారుదల శాఖ అధికారులతో సమన్వయంతో పని చేయాలని తెలిపారు. గ్రామాల్లో చెడిపోయిన చేతిపంపులకు మరమ్మత్తులు చేయించాలన్నారు. మిషన్ భగీరథ లీకేజలను వెంటనే సరి చేయాలని ఆదేశించారు. బోరు బావుల వద్దపశువుల కోసం ఏర్పాటుచేసిన నీటి గుంతలను పూడిక తీసి నీటితో నింపాలన్నారు. చేతిపంపులవద్ద నీరు నిలవకుండా ఇంకుడు గుంతలను శుభ్రం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్ ఎంపీఓ సత్యనారాయణ, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు నందకుమార్, రమేష్, భార్గవ్, లక్ష్మి పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయం సీజ్

● మంచిర్యాల కోర్టు సంచలన తీర్పు



నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో సామాగ్రిని బుధవారం జిల్లా కోర్టు ఉత్తర్వుల మేరకు కోర్టు సిబ్బంది సీజ్ చేశారు. వివరాల్లోకి వెళితే జిల్లాలోని కోటపల్లి మండలం పారుపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 479, 480లలో గల 23 ఎకరాల 27 సెంట్ల భూమిలో మల్బరీ యూనిట్ ఏర్పాటు కోసం అప్పటి ఆర్డీఓ, ల్యాండ్ అక్వేషన్ అధికారి భూ సేకరణ చేపట్టారు. ఆ భూమికి నష్టపరిహారం చెల్లింపు విషయంలో జరిగిన జాప్యం కారణంగా ఆ భూమిని కోల్పోయిన బాధితుడు 1982లో కోర్టును ఆశ్రయించాడు. అప్పటి నుంచి ఆ వివాదం కాస్త విచారణలో ఉంది. మొదటగా ఆసిఫాబాద్ కోర్టు, అనంతరం జిల్లా కోర్టు, ఆ తర్వాత హై కోర్టులో విచారణ జరిగింది. దీనిపై హై కోర్టు అక్టోబర్ 4న మూడు నెలల్లోగా పట్టాదారుకు రూ.2.92 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని తీర్పును వెలువరించింది. ఆరు నెలలు గడిచినా అధికారులు పరిహారం చెల్లించనందున మంచిర్యాల సబ్ కోర్టులో హై కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని పిటీషన్ వేయడంతో కోర్టు ఆదేశాల మేరకు కోర్టు సిబ్బంది ఆర్డీఓ కార్యాలయంలోని కంప్యూటర్ పరికరాలు, ఫర్నిచర్, ఇతర సామాగ్రిని సీజ్ చేశారు. కాగా ప్రభుత్వ కార్యాలయంలోని సామగ్రి సీజ్ కావడం చర్చనీయాంశమైంది.

కలెక్టర్ జోక్యంతో ఆగిన జప్తు

ఆర్డీఓ కార్యాలయ సామాగ్రి జప్తు విషయం తెలుసుకున్న కలెక్టర్ జోక్యం చేసుకొని సంబంధిత జిల్లా కోర్టు న్యాయమూర్తితో చర్చించినట్లు సమాచారం. దీంతో న్యాయమూర్తి జప్తును నిలిపివేయాలని తమ సిబ్బందిని ఆదేశించగా జప్తు ప్రక్రియను నిలిచిపోయింది.

పిడుగుపాటుకు ఏడు మేకలు మృతి



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని నర్సాపూర్ గ్రామంలో బుధవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. పిడుగుపాటుకు ఏడు మేకలు మృతి చెందాయి. అదే గ్రామానికి చెందిన పులిసెట్టి శ్రీనివాస్, తొట్ల సత్తయ్యలకు చెందిన మేకలు చనిపోయాయి. కాగా వాటి విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకున్నారు.

జన్నారం : మండలంలోని రాంపూర్, తిమ్మాపూర్, తపాలాపూర్, రోటి గూడ, అహ్మదాబాద్, చింతగూడ, తదితర గ్రామాల్లో బుధవారం వడగళ్ల వాన కురిసింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆకాశం ఒకేసారి మేగావృతమై, విపరీతమైన ఈదురు గాళులు విచాయి. పలు గ్రామాల్లో మొక్కజొన్న పంట పూర్తిగా నేలమట్టమయింది. పలు గ్రామాల్లో వడగల్లు వాన కురిసింది. తిమ్మాపూర్ గ్రామంలో 15 ఎకరాల వరకు, మొక్కజొన్న పంట నేలమట్టం అయింది. వ్యవసాయ శాఖ అధికారులు సర్వే నిర్వహించి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించే విధంగా కృషి చేయాలని రైతుల కోరుతున్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం

● పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్



నవతెలంగాణ-జన్నారం

భగత్ సింగ్ స్ఫూర్తితో విద్య వైద్యం ఉపాధి ఉద్యోగ అవకాశాల కోసం మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదామని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో భగత్ సింగ్ 93వ వర్ధంతి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారతదేశ విముక్తి కోసం స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను భారత జాతికి అంకితం ఇచ్చారన్నారు. ఉరితాడును ముద్దాడి అమరులయ్యారన్నారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో యువత యువజన పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అమెరికా, రష్యా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. దేశంలో రోజురోజుకు మతోన్మాదం, ఫాసిజం పెరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో విఫలం అయ్యాయని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత పెడదారి పడుతున్నారన్నారు. సమానత్వం, సమ సమాజ కోసం జరుగుతున్న పోరాటంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాదానికి, పెట్టుబడిదారీ విధానానికి, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా స్వేచ్ఛా, స్వాతంత్ర్యం కోసం దోపిడీ, పీడన లేని నూతన వ్యవస్థ కోసం యువతీ యువకులు తిరుగుబాటుకి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భగత్ సింగ్, రాజు గురు సుఖదేవ్ ల వర్ధంతులను పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గ్రామగ్రామాన, వాడవాడనా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు నరేష్, రాజు, స్వామి, శ్రీను పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | మార్చి 21, 2024 | www.navatelangana.com

అధికారులతో ఐటీ డీజీఎం వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ-మందమర్రి



సింగరేణి ఏరియా అధికారులతో బుధవారం ఐటీ డీజీఎం హరిశంకర్‌రావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహికంచారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సేఫ్టీ అధికారులు, సంక్షేమ అధికారులు, పర్సనల్ డిపార్ట్మెంట్, వీటీసీ అధికారులు, హాస్పిటల్ సిబ్బందికి వీటీసీ శిక్షణ, ఐఎంఈ, పీఎంఈలకు ఆన్‌లైన్ దరఖాస్తులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఐటీ డీవై మేనేజర్ బి రేష్మ, నాగ దీవ, కె రఘు కుమార్ పాల్గొన్నారు.

గులాబి పురుగు నషింపజేసేందుకు అవగాహన కల్పించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గులాబీ రంగు ఉధృతిని తగ్గించడానికి, దీనిపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.బి.రాంప్రసాద్ అన్నారు. బుధవారం మార్కెట్ యార్డులో గులాబి రంగు కాయ తొలుచు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిన్నింగ్ మిల్లుల యాజమానులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా. బి.రాంప్రసాద్ మాట్లాడుతూ పత్తి పంటలో గులాబి రంగు కాయ తొలుచు పురుగు ఆశించి, రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయన్నారు. మిల్లుకు వచ్చే పత్తిలో కూడా గులాబి రంగు పురుగు ఉంటుందన్నారు. గుడ్డి పత్తిలో పురుగు లార్వ, గుడ్లు ఉంటాయని, అవి మళ్లీ వృద్ధి చెందుతాయన్నారు. నివారణకు శాస్త్రవేత్తలు తెలిపే జాగ్రత్తలను మిల్లుల యజమానులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.రాజశేఖర్, ప్రవీణ్ కుమార్, జిన్నింగ్ మిల్లుల యాజనుల సంఘం అధ్యక్షుడు రాజు చింతవార్, మార్కెట్ కార్యదర్శి దేవన్న పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధించిన భర్తకు జైలుశిక్ష

నవతెలంగాణ-ఖానాపూర్

అదనపు కట్నం కోసం భార్యని వేదించిన కేసులో భర్తకు ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష, రూ.5వందల జరిమాన విధించినట్టు ఖానాపూర్ మొదటి శ్రేణి న్యాయమూర్తి జిలిన్ కుమార్ బుధవారం తీర్పును వెలువరించారు. ఖానాపూర్ మండలంలోని కర్లపాడు గ్రామానికి చెందిన పిట్ల రజిత(35)కు 2013సంవత్సరంలో జగిత్యాల జిల్లా మొగిలిపేట గ్రామానికి చెందిన పిట్ల సాయిరాం(37)తో పెళ్లి జరిగింది. కాగా ఒక సంవత్సరం తర్వాత భర్త అదనపు కట్నం కోసం భార్యను వేధించ సాగాడు. ఈ క్రమంలో వీరిద్దరికీ ఇద్దరు పిల్లలు కుమారుడు, కుమార్తె జన్మించారు. ఆ తర్వాత 2014లో ఆమె భర్త ఉపాధి నిమిత్తం బయట దేశానికి వెళ్లి పోయాడు. ఆ సమయంలో బాధితురాలు తన ఇద్దరు పిల్లలను తీసుకొని తన తల్లి ఇంట్లోనే ఉంటూ పిల్లలకు పోషణ నిర్వహించింది. ఆ తర్వాత 2017లో మార్చి నెలలో తన భర్త బయట దేశం నుంచి ఇంటికి రాగా, ఈమె ఇద్దరు పిల్లలను తీసుకొని తన వద్దకు వెళ్లగా, ఆ సమయంలో నాకు రావాల్సిన అదనపు కట్నం రెండు లక్షలు తీసుకొని రావాలని, లేకపోతే నాకు నీతో పని లేదని అన్నాడు. ఎన్నోసార్లు పంచాయతీ నిర్వహించిన అతనిలో మార్పు రానందున పిట్ల రజిత తన భర్తపై ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో 2017 సంవత్సరంలో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై ఆర్.చిన్నయ్య కేసు నమోదు చేసి పరిశోధన చేసిన అనంతరం నేరస్తుని అరెస్టు చేసి పరిశోధన చేసిన నివేదికను కోర్టులో దాఖలు చేయగా, ఆ కేసులో ఏపీపీఓ జి.రామకృష్ణ తొమ్మిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా సాక్షులు చెప్పిన సాక్ష్యం కోర్టులో రుజువు అయిందని, దీంతో పిట్ల సాయిరామ్‌కు శిక్ష ఖరారైనట్లు జిల్లా కోర్టుల సమన్వయ అధికారి సక్రియా నాయక్ తెలిపారు.

అంగన్‌వాడీల్లో మరింత పౌష్టికాహారం

నవతెలంగాణ-ఉట్నూర్

అంగన్‌వాడీల్లో మరింత పౌష్టికాహారం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ శ్రావణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గంగన్నపేట్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ అభియాన్‌పై తల్లులకు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు ఆరెండ్లలోపు పిల్లల పోషణ స్థితి మెరుగుదలకు అదనపు పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను రక్తహీనత హైరిస్క్ గర్భిణులు, బాలింతలు, తీవ్ర పోషకాహార లోపం ఉన్న మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిర్మల, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు రత్నమాల, తల్లులు విద్యార్థులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన ఏఈఓ

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంతో పాటు కొండపూర్ గ్రామంలో బుధవారం ఏఈఓ ప్రవీణ్ వడగండ్ల వర్షంతో నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు కురిసిన వర్షాల వల్ల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారు. నష్టపోయిన పంటల వివరాలను సర్వే చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ కె.కల్పన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజల సలహాలు, సూచనలు, ఫిర్యాదులకు 9959226002ను సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు తెలిపారు. పట్టణంలో బుధవారం ఉమ్మడి జిల్లా పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమై ఎన్నికల సన్నద్ధతపై విస్తృతంగా చర్చించారు. మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి అనిల్ జాదవ్, పార్టీ ముఖ్య నాయకులు జాన్సన్ నాయక్, రాంకిషన్ రెడ్డి, లోలం శ్యాంసుందర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రణాళికలు, ప్రచార వ్యూహాలు, ఇతరత్రా అంశాలపై చర్చించారు. ఈ మేరకు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రపథంలో నిలిపేలా గత బీఆర్ఎస్ ప్రభుత్వం విశేష కృషి చేసిందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించిన పార్టీ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియచేశారు. పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీల ఇన్‌చార్జ్లు, ముఖ్య నాయకులతో సమావేశమై ఎన్నికల సన్నద్ధతపై చర్చించినట్లు వివరించారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

నవతెలంగాణ-నిర్మల్

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని తెలంగాణ వ్యవసాయ సంఘం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో ప్రధానంగా బైంసా డివిజన్‌లో ఎక్కువగా మొక్కజొన్న పంటను పండిస్తున్నారని అన్నారు. అలాగే నిర్మల్, ఖానాపూర్ ప్రాంతంలో సైతం మొక్కజొన్న పంట బాగానే విస్తరించిందని తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.2,070 ఉందన్నారు. కానీ బయట మార్కెట్‌లో తక్కువకు ప్రయివేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. వెంటనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలని ప్రారంభించి రైతులకు నష్టం జరగకుండా చూడాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగేల్లి నర్సయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, నిర్మల్ మండల అధ్యక్షులు బర్కుంట గంగారాం, నిర్మల్ మండల కార్యదర్శి చందుల సాయికిరణ్ పాల్గొన్నారు.

ఇకపై ఆన్‌లైన్‌లో మెడికల్ శిక్షణ వివరాలు

నవతెలంగాణ-రెబ్బెన

మెడికల్ శిక్షణ వివరాలు ఇకపై ఆన్‌లైన్‌లో ఉంటాయని డీజీఎం(ఐటీ) హరీష్ శంకర్‌రావు తెలిపారు. బుధవారం ఎస్ఓటు జీఎం మచ్చగిరి నరేందర్‌రావుతో కలిసి మాట్లాదడారు. బెల్లంపల్లి ఏరియాలోని అన్ని విభాగాల ఉద్యోగులకు ఐఎంఈ, పీఎంఈ, వీటీసీ శిక్షణ వివరాలు ఇకపై ఆన్‌లైన్‌లోనే ఉంటాయన్నారు. ఆన్‌లైన్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. గతంలో మాదిరిగా మ్యాన్‌వల్‌గా కాకుండా అన్ని వివరాలు ఆన్‌లైన్‌లనే పొందుపరచాలని తెలిపారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీవైపీఎం వేణు, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, ఈఈ రాజేంద్రప్రసాద్, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ మజీబ్, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించాలి

• పోలింగ్ కేంద్రాలను సందర్శించిన డీసీపీ అశోక్‌కుమార్

నవతెలంగాణ-జైపూర్

లోక సభ ఎన్నికలు సజావుగా నిర్వహించదానికి కోసం సాయుధ బలగాలతో చెక్‌పోస్టుల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించాలని మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్ అన్నారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి బుధవారం మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అదేవిధంగా రాపనపల్లి-సిర్వంచ అంతరాష్ట్ర వంతెన వద్ద వాహణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహణాలను పోలీస్ అధికారుల సహాయంతో క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి సూచన చేశారు. చెక్‌పోస్టులు కీలకమని, సాయుధ బలగాలతో కూడిన పహారతో పకడ్బందీగా చెక్‌పోస్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్రమ మార్గంలో ఎటువంటి మద్యం, డబ్బు, ప్రజలను ప్రలోభపెట్టే వస్తువులను రాకుండా వివిధ శాఖల సమన్వయంతో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేలా వాతావరణాన్ని నెలకొల్పేందుకు చర్యలను తీసుకోనున్నట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది విసిబుల్‌గా ఉంటూ పోలింగ్ కేంద్రాలను నిరంతరం సందర్శిస్తూ అక్కడి ప్రజలకు ప్రశాంత వాతావరణంలోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఎటువంటి గొడవలు లేకుండా ఎన్నికలను సజావుగా నిర్వహించేలా తోడ్పాటు అందించడంపై అవగాహణ కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్ పాల్గొన్నారు.

తాండూర్ : లోకసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు చెక్‌పోస్ట్‌ల వద్ద అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆసిఫాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రె అన్నారు. ఆసిఫాబాద్-మంచిర్యాల జిల్లాల సరిహద్దుల్లో ఏర్పాటుచేసిన గోలేటి సిహెచ్‌పి, రేపల్లెవాడ చెక్ పోస్టులను



ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్, అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాతీయ రహదారి గుండా వెళ్లే ప్రతి వాహనాన్ని తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా అక్రమంగా తరలించే నగదు, మద్యం, కానుకల రవాణాను అరికట్టాలన్నారు. సరైన ఆధారాలు లేకుండా రూ.50 వేలు మించి నగదు లభ్యమైతే సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించాలని సూచించారు. చెక్‌పోస్ట్‌ల వద్ద విధుల్లో నిర్లక్ష్యం చేస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా మండలంలోని పోలింగ్ కేంద్రాన్ని, పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట రెబ్బెన తహసీల్దార్ జ్యోత్స్న, సీఐ చిట్టిబాబు, ఎస్ఐ చంద్రశేఖర్ ఉన్నారు.

ఆర్కే-5 గని సిబ్బందికి జీఎం అభినందనలు



నవతెలంగాణ-నస్పూర్

2023-24 వార్షిక లక్ష్యాన్ని 100శాతం పూర్తి చేసినందుకు ఆర్కే5 గని ఉద్యోగులు, అధికారులను శాంపి ఏరియా జీఎం సంజీవరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా ఉన్న 24 భూగర్భ గనులలో రెండు భూగర్భ గనులు మాత్రమే తమ వార్షిక నిర్దేశిత లక్ష్యాలను సాధించాయని, అందులో శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 5, ఆర్కే 6 గనులు ఉండడం సంతోషకరమైన విషయమని, అలాగే రాబోవు ఆర్థిక సంవత్సరంలో కూడా ఉద్యోగులు తమకు నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని, దానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు గని ఏజెంట్, మేనేజర్ ఎల్లవేళలా ప్రణాళికలను రచిస్తూ ఉండాలని సూచించారు. బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకతో పాటు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయడంలో గని ఉద్యోగులు అధికారులు తమ వంతు బాధ్యత నిర్వర్తించారని, మూడు సంవత్సరాలుగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో ఈ గ్రూపు రెండు గనులు ముందుంటున్నాయని గుర్తు చేశారు. గ్రూప్ ఏజెంట్ ఏ. వి రెడ్డి, మేనేజర్ అబ్దుల్ ఖాదీర్ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉద్యోగుల నిబద్ధత, ఉత్పత్తి లక్ష్య సాధనలో గుర్తింపు సంఘంతో పాటు అన్ని కార్మిక సంఘాల సంపూర్ణ సహకారంతోనే ఇదంతా సాధ్యమైందన్నారు. ఉత్పత్తి లక్ష్యాన్ని సమిష్టి కృషితో 11 నెలల 20 రోజుల్లోనే అధిగమించారని, 2023-2024 ఉత్పత్తి లక్ష్యం 2 లక్షల 70 వేలు కాగా మార్చి 31 లోగా సాధించాల్సిన టార్గెట్‌ను మరొ పది రోజులు మిగిలి ఉండగానే ఆర్కే5 గని మార్చి 20కే 2లక్షల 72వేల 500 టన్నులకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో గని రక్షణాధికారి ఇ.శివయ్య, పిట్ ఇంజనీర్ వి.రాధాకృష్ణ, గని సంక్షేమాధికారి బి.రణదీప్ గౌడ్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో నోడల్ అధికారుల పాత్ర కీలకం

• కలెక్టర్ వెంకటేష్ దోతే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారుల పాత్ర కీలకమైనదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ సురేష్ కుమార్‌తో కలిసి నోడల్ అధికారులతో ఎన్నికల విధులు, నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా జిల్లాలో మొత్తంగా 676 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సామాగ్రి నిర్వహణలో భాగంగా ఎన్నికల సామాగ్రి ఫారములు, బ్యాలెట్ పత్రాలు, చెరగని ఇంక్, ఇతర ఎన్నికల సామాగ్రి సేకరణ, పంపిణీ చేయాలన్నారు.రవాణా నిర్వహణలో భాగంగా ఎన్నికలలో ఉపయోగించే అన్ని రకాల రవాణా అవసరాలు, లభ్యత, కొరత ఏర్పడినప్పుడు ఇతర జిల్లాల నుండి సర్దుబాటు, జిల్లాలో కేటాయింపు చర్యలు తీసుకోవాలని సూచించారు. కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీలో భాగంగా సైబర్ సెక్యూరిటీ నిబంధనలకు అనుగుణంగా జిల్లా వెబ్‌సైట్ నవీకరణ, సిఐటి పనితీరు, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పర్యవేక్షణ, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు, సాంకేతిక మద్దతు అందించడం జరుగుతుందని వివరించారు. స్వీప్‌లో భాగంగా ప్రణాళికను ఖరారు చేసే బాధ్యత, సర్వే, ఓటర్ల నమోదును పెంచే మార్గాలను రూపొందించడం, ఎన్నికల ముందు, తరువాత స్వీప్ డాక్యుమెంట్ చేయల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు నియమించిన నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

యాసంగి 2024 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో వరి ధాన్యం కొనుగోళ్ల, కేంద్రాల నిర్వహణపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) ఆధ్వర్యంలో 203 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. నిర్ణీత తేమ శాతం వచ్చిన తర్వాతే రైతులకు ధాన్యం బస్తాలు పంపిణీ చేయాలన్నారు. కేంద్రాల వద్ద రైతులకు వరి ధరలు, ఇతర సమాచరం తెలియజేసేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని అన్నారు. అనంతరం స్వీప్ ఆధ్వర్యంలో లోక్‌సభ ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో స్వీప్ ఆధ్వర్యంలో విస్తృతంగా



అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ విజయలక్ష్మి, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిని నందిత, మార్కెటింగ్ ఏడీఎం అశ్వక్, అధికారులు పాల్గొన్నారు.

నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-నిర్మల్

ఎండల తీవ్రత కారణంగా గ్రామాల్లో నీటి సమస్యలు ఏర్పడకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రామాల్లో పనిచేయని బోర్‌వెల్స్, చేతిపంపులకు మరమ్మత్తులు చేయించాలని ఆదేశించారు. నీటిసమస్య అధికంగా ఉన్న గ్రామాలు, ఇతర ప్రదేశాలలో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని సూచించారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలికి ఉపాధి హామీ చట్టం కింద వంద రోజుల పని దినాలు కల్పించాలని ఆదేశించారు. వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలని, గ్రామాలలో చేపట్టిన రోడ్డు, డ్రైనేజీల నిర్మాణాలు వెంటనే పూర్తీ చేయాలనీ ఆదేశించారు. నర్సరీలోనీ మొక్కలను సంరక్షించాలని, ప్రతి రోజు నీరందించాలని, గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయాలనీ సూచించారు. పారిశుధ్యం, ప్రభుత్వ కార్యక్రమాలను పంచాయతీ కార్యదర్శులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ విజయలక్ష్మి, జిల్లా పరిషత్ సీఈఓ గోవింద్, ఎంపీడీఓలు, అధికారులు పాల్గొన్నారు.

23న కళాశాలలో జాబ్ మేళా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో 23న శనివారం రోజు టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో టాస్క్ వారి సౌజన్యంతో జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. ఎ.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో ఎయిర్టెల్ పేమెంట్ బ్యాంక్, 24/7 ఏఐ, రిలయన్స్ జియో కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాకు అర్హతలు ఏదైనా డిగ్రీ, డిప్లమా కలిగి 2022, 2023, 2024 సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. విద్యార్థులు ఇంటర్వ్యూకు వచ్చేటప్పుడు ఒక జత రెజ్యూమ్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఒరిజినల్ అండ్ జిరాక్స్ సెట్ ఐడి ప్రూఫ్ తెచ్చుకోవాలని సూచించారు. సమయం ఉదయం 9 గంటల నుండి ఈ జాబ్ డ్రైవ్ ప్రారంభమవుతుందన్నారు. ఇతర వివరాలకు ఎండి. ఇమ్రాన్ అలీ 9703533626, డాక్టర్. ఎం.నర్సింగరావు 9441012 766 కు సంప్రదించాలని తెలిపారు.

మానవత్వం చాటిన కళాశాల అధ్యాపకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ అధ్యాపకులు మానవత్వం చాటారు. తమ కళాశాల ఆవరణలోని డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్న షంషీర్‌కు రెండు సార్లు గుండె ఆపరేషన్ జరిగింది. ఒక వైపు వేతనం లేక మరో వైపు ఆస్పత్రి ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న చిరుద్యోగి షంషీర్ దీన స్థితికి అధ్యాపకులు చలించిపోయారు. తలా కొంత పోగు చేసి రూ.12వేలు ఆర్థిక సాయం బుధవారం అందించారు. కండ్లలో నీళ్లు పెట్టుకున్న ఆ చిరుద్యోగి అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుద్ఘాతంతో ఎద్దు మృత్యువాత

నవతెలంగాణ-బేల

మండలంలోని గూడ గ్రామ శివారులో పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి బుధవారం రైతు గుణవంత్‌కు చెందిన ఎద్దు మృత్యువాత చెందింది. రైతు సిరామే గుణవంత్ మాట్లాడుతూ తన ఎద్దు విలువ రూ.60వేలు ఉంటుందని, తనకు ప్రభుత్వం తరుపున ఆదుకోవాలని వేడుకున్నాడు.

అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-జైనథ్

అక్రమంగా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ సాయినాథ్ తెలిపారు. బుధవారం జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు డీఎస్పీ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో జైనథ్ పోలీస్ స్టేషన్ పరిధిలో లోని గిమ్మ, మేడిగూడ గ్రామాలలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం ముందస్తు సమాచారం మేరకు తనిఖీ నిర్వహించి అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. గిమ్మ గ్రామంలో 96 లీటర్లు విలువ రూ. 65 వేలు, మేడిగూడ గ్రామంలో 50 లీటర్లు విలువ రూ.25వేల మద్యాన్ని సీజ్ చేసి, స్వాధీన పరుచుకుమని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమంగా ఎవరైన మద్యం షాపులు నిర్వహించినట్లయితే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా మద్యం బెల్ట్ షాపులు నిర్వహించినట్లయితే అట్టి సమాచారాన్ని పోలీసులకి తెలియజేయాలని అన్నారు.

నిరుపయోగంగా బస్టాండు

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో 20 సంవత్సరాల క్రితం నిర్మించిన బస్టాండుకు బస్సులు రాక నిరుపయోగంగా మారింది. ప్రభుత్వాలు మారిన బస్టాండు రూపురేఖలు మారకపోవడంతో బస్సులు రాక బిచ్చగాళ్లకు నిలయంగా ఉంది. ఎండాకాలం, వర్షాకాలంలో నిలబడడానికి కూడా స్థలం లేకపోవడంతో దుకాణ సముదాయాల వద్ద నిలబడాల్సి వస్తుంది. ప్రజలకు ఉపయోగపడుతుందని నిర్మించిన బస్టాండు ఆలంకరంగా ఉంది. ప్రభుత్వాలు మారిన బస్టాండుకు బస్సులు రావడంలేదు. ఇప్పటికైనా కొత్తగా వచ్చిన ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండుకు బస్సులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రజాకర్ సినిమాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా గత శుక్రవారం విడుదలైన రజాకర్ సినిమా దర్శకుడు సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలంటూ ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజాకార్ సినిమా తమ మనోభావాలు దెబ్బతీసేలా ఉందని అన్నారు. తాము రాజ్యాంగానికి నైతిక విలువలకు కట్టుబడి ఉన్నామని, అటువంటి తమ వర్గాన్ని చిన్నచూపు చూసేలా సంఘటనలున్నాయని, వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఉబేద్ బిన్ యహీయా, నాయకులు అబ్దుల్లా, నిసార్, ఖలీల్ మహమ్మద్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ ఇంజనీర్‌కు సమస్యలు తెలిపిన జడ్పీటీసీ



నవతెలంగాణ-రెబ్బెన

మండల కేంద్రంలో నేషనల్ హైవే పనులు నత్తనడకన సాగుతుండడంతో ఎదురయ్యే ఇబ్బందులను జడ్పీటీసీ వేముర్ల సంతోష్ నేషనల్ హైవే ఇంజనీర్ అంజత్ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం కురిసిన వర్షం వల్ల సర్వీసు రోడ్డు పూర్తిగా ధ్వంసమైందన్నారు. రోడ్డు పక్కన మురుగు కాల్వలు కట్టకపోవడంతో పలువురి ఇండ్లలోకి వర్షపు నీరు చేరిందన్నారు. అప్రోచ్ రోడ్డులో డాంబర్ వేయకపోవడం వల్ల వాహనదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రోడ్డు ఎత్తు ఎక్కువగా ఉండడంతో గర్భిణులు ఆస్పత్రి వద్ద దిగడానికి, ఎక్కడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పీడీతో మాట్లాడి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామ ఇంజనీర్ అంజత్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మధునయ్య ఉన్నారు.